శుక్రవారం
26-07-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 35
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇజ్రాయిల్ పౌరులపై ఆస్ట్రేలియా ఆంక్షలు

క్యాన్బెర్రా: వెస్ట్‌బ్యాంక్‌లో హింసతో ముడిపడి ఉన్న కొందరు ఇజ్రాయిల్ పౌరుల పై ఆంక్షలు విధిస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీచేసింది. దురాక్రమణపై ఆస్ట్రేలియా ఈ తరహా చర్యలకు ఉపక్రమించడం ఇదే మొదటిసారి. విదేశీ వ్యవహారాల మంత్రి పెన్నీ వోంగ్ ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. పలస్తీనియన్లపై హింసలో పాల్గొన్న ఏడుగురు ఇజ్రాయిలీలు, యువ సంఘానికి చెందిన వారిపై ఆర్థిక ఆంక్షలు, ప్రయాణ నిషేధం విధించినట్లు తెలిపారు. పలస్తీనా భూభాగంలో ఇజ్రాయిలీ దురాక్రమణ అంతర్జాతీయ చట్టానికి విరుద్ధమని క్యాన్బెర్రా విశ్వసిస్తోందని వోంగ్ వెల్లడించారు. హింస, దురాక్రమణను నిలుపుదల చేయాలని ఇజ్రాయిల్‌కు సూచిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో టూ స్టేట్ పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

రైతులకు రెట్టింపు ఆదాయం
సంగతేంటి?

- మోదీ సర్కారును నిలదీసిన విపక్షాలు
- మాటలయుద్ధంతో దద్దరిల్లిన లోక్‌సభ

న్యూదిల్లీ: కేంద్రబడ్జెట్‌పై చర్చ సందర్భంగా రైతుల అంశం గురువారం లోక్‌సభను కుదిపేసింది. విపక్ష సభ్యులు ప్రత్యేకించి కాంగ్రెస్ సభ్యులు రైతుల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. మోదీ సర్కారు రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలుకు ముందుకు రావడం లేదని నిందించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న ప్రధాని మోదీ హామీ గాలిలో కలిసిపోయిందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రైతుల సమస్యపై అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో భోజనానికి ముందు లోక్‌సభ రెండుసార్లు వాయిదా పడింది. రైల్వే, ఆహారశుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ, కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ మధ్య మాటల యుద్ధం జరిగింది. కేంద్ర బడ్జెట్‌పై చర్చలో పాల్గొన్న చన్నీ... దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు... మోదీ సర్కారు వైఫల్యంపై విమర్శలు ఎక్కుపెట్టారు. రుణమాఫీ, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ సహా కీలక సమస్యలపై రైతుల ఆందోళనను మోదీ సర్కారు నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఈ క్రమంలో బిట్టూ తాత, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ హత్యను ప్రస్తావించడంతో ఇటీవలే కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన బియాంత్ మనవడు బిట్టూ, చన్నీ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. చన్నీ, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీపై బిట్టూ వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం దుమారం రేపింది. దీంతో అధ్యక్ష స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ సంధ్యారే సభను 30 నిమిషాల పాటు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశం అయ్యాక... రక్షణ మంత్రి, లోక్‌సభలో బీజేపీ ఉపనేత రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... సభ్యులు ఏవైనా అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలు చేసినట్లయితే వాటిని రికార్డుల నుంచి తొలగించి బడ్జెట్‌పై చర్చ కొనసాగించాలని స్పీకర్‌ను కోరారు. అప్పటికీ సభలో అలజడి తగ్గకపోవడంతో సభ గౌరవాన్ని కాపాడాలని స్పీకర్ ఓం బిర్లా అధికార, ప్రతిపక్ష సభ్యులను ఆదేశించారు. ముఖ్యంగా మంత్రులు నిబంధనలను ఉల్లంఘించకూడదని అన్నారు. అనంతరం చన్నీ తన ప్రసంగాన్ని కొనసాగించారు. బుధవారం కొందరు రైతు నేతలతో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కలిసిన విషయాన్ని ప్రస్తావించిన చన్నీ... ప్రధానిని కలిసేందుకు కూడా వారు సమయం కోరినట్లు తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోలేదని చన్నీ

- మిగతా 2 లో

అప్పు పది లక్షల కోట్ల పైనే !

పెండింగ్ బకాయిలు రూ.1,41,588 కోట్లు
నేడు ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ఆదాయం, అప్పుల వివరాలను ప్రజల ముందుంచేందుకు సీఎం చంద్రబాబు సిద్ధమయ్యారు. శుక్రవారం శాసనసభలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై లోతుగా అధ్యయనం చేసిన కూటమి ప్రభుత్వం... 2019-24 మధ్య పెండింగ్ బిల్లులు రూ.1,41,588 కోట్లు ఉన్నట్లు గుర్తించింది. ఉద్యోగులు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు రూ.వేల కోట్లు ఉన్నట్టు తేల్చింది. పెండింగ్

- మిగతా 2 లో

నేరరహిత రాష్ట్రమే లక్ష్యం

- జగన్ పాలనలో పోలీస్ వ్యవస్థ అపహాస్యం
- ప్రతిపక్షాల అణచివేతకే ఖాకీల వినియోగం
- లెక్కలేనన్ని హత్యలు, అరాచకాలు
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు వెల్లడి
- శాంతిభద్రతలపై శ్వేతపత్రం విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఒకప్పుడు దేశానికే గర్వకారణంగా నిల్చిన ఏపీ పోలీస్ వ్యవస్థను గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ అపహాస్యానికి గురయ్యేలా దుర్వినియోగం చేశారని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో పూర్తిగా దెబ్బతిన్న శాంతి భద్రతలను మళ్లీ గాడిలో పెడతామని, నేర రహిత సమాజమే లక్ష్యంగా అడుగులు వేస్తామని స్పష్టం చేశారు. శాసనసభలో గురువారం శాంతిభద్రతలపై చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేస్తూ, రాష్ట్రంలో జరిగిన దారుణాలపై గత ఐదేళ్ల తన ఆవేదన ఆవిష్కృతం చేసేలా సభలో ప్రసంగించారు. గత ఐదేళ్లలో నాపైనే 17 అక్రమ కేసులు పెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజల కోసం బాబ్లీ ప్రాజెక్టు వద్ద ఆందోళన చేయడానికి వెళ్లినప్పుడు తప్ప నాపై ఒక్క కేసు కూడా లేదు. అలాంటిది 2019లో జగన్

- మిగతా 2 లో

ఆ 15 వేల కోట్లు గ్రాంట్‌గా ఇవ్వాలి

కేంద్రానికి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం ఇచ్చే ఆర్థిక సాయం మొత్తాన్ని గ్రాంట్‌గా మార్చాలని, పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర విభజనతో ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ కారణాలతో అభివృద్ధికి నోచుకోని అమరావతి రాజధాని నిర్మాణం కోసం 15 వేల కోట్ల రూపాయలు రుణం ఇప్పిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనటాన్ని ఆక్షేపించారు. రాజధాని నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న రూ.15 వేల కోట్లు గ్రాంట్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రం అప్పులకుప్పగా మారిందని, ఇప్పుడు అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు ద్వారా రుణభారం మోపటం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందనగా ఉంటుందని రామకృష్ణ పేర్కొన్నారు. రుణాలు ఇప్పిస్తామనటాన్ని రాష్ట్ర ప్రజలు సమర్థించబోరని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో నిర్వాసితులకు పరిహారంపై కేంద్రం స్పష్టత ఇవ్వకపోవటం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. నిర్వాసితులకు కేంద్రమే రూ.30 వేల కోట్లు గ్రాంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి రుణభారాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై మోపటం దుర్మార్గమన్నారు. మోదీ ప్రభుత్వం పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పూర్తి బాధ్యత కేంద్రం తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

పోలవరానికి కొత్త డయాఫ్రమ్ వాల్

నీతి ఆయోగ్ సమావేశానికి ప్రతిపాదనలు
రాష్ట్ర అత్యవసర మంత్రివర్గ సమావేశం తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కొత్త డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి రాష్ట్రమంత్రి వర్గ సమావేశం ఆమోదం తెలిపింది. గురువారం అసెంబ్లీ సమావేశాలు వాయిదా పడిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో అత్యవసర మంత్రివర్గ సమావేశం జరిగింది. తొలుత ఏపీకి ఆర్థిక చేయూత ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ తీర్మానించింది. పోలవరం నిర్మాణాన్ని కేంద్రమే చేపడుతుందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో ఈనెల 27న దిల్లీలో జరిగే నీతిఆయోగ్ సమావేశానికి నూతన డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి అనుకూలంగా ప్రతిపాదనలు పంపాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఇటీవల కురిసిన వర్షాలతో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న సంగతి విదితమే. ప్రస్తుతం ఉన్న డయాఫ్రమ్ వాల్‌కు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో మరమ్మతులు చేసినా గ్యారెంటీ ఇవ్వలేమని, ప్రస్తుతం ఉన్న డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా మరో డయాఫ్రమ్

- మిగతా 2 లో

వేల ఎకరాల భూకబ్జా

వైసీపీ నేతలతో అధికారుల కుమ్మక్కు
చర్యలు తీసుకోవాలని సీపీఐ భారీ ర్యాలీ, ధర్నా

విశాలాంధ్ర- బద్వేలు: కడప జిల్లాలో వైసీపీ నేతలు కబ్జా చేసిన భూములు స్వాధీనం చేసుకొని...పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆందోళనకు దిగింది. సీపీఐ బద్వేలు ఏరియా సమితి అధ్వర్యంలో పట్టణంలో భారీ ప్రదర్శన, బద్వేలు ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు వేలాదిగా ర్యాలీలో పాల్గొన్నారు. భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని, ఆ స్థలాలను పేదలకు పంచాలని నినదించారు. ఆర్‌డీఓ కార్యాలయం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గం అక్కింగుండ్ల పొలం మొదలుకొని అట్లూరు వరకు దాదాపు 30 వేల ఎకరాల ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని విమర్శించారు. అవి పేదలకు దక్కాల్సిన భూములని చెప్పారు. రెవెన్యూ అధికారుల ప్రోత్సాహంతో నాయకులు ఇష్టానుసారం భూములు ఆక్రమించుకున్నారని తెలిపారు. కబ్జాదారులను, వారికి సహకరించిన అధికారులను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

'కన్వర్' యాత్రికుల వీరంగం

- ముస్లింలు సహా స్థానికులపై విచక్షణారహిత దాడులు
- కావడిని తాకి అపవిత్రం చేశారంటూ తప్పుడు కథనాలు

న్యూదిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో కన్వర్ యాత్ర హింసకు అడ్డాగా మారిపోతోంది. ముస్లింలే కాదు అటుగా వెళ్లే ఎవరూ సురక్షితం కాదన్నట్లుగా పరిస్థితులు ఉన్నాయి. ముజఫర్‌నగర్, సహరన్‌పూర్, హరిద్వార్ వంటి సున్నిత ప్రాంతాల్లో యాత్రికులు రెచ్చిపోయారు. తమ కావడిని అపవిత్రం చేశారన్న నెపంతో విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. ఇటువంటి నాలుగు హింసాత్మక ఘటనలు గత రెండు రోజుల్లో నమోదయ్యాయి. కన్వర్ యాత్ర సందర్భంగా మైనారిటీ వర్గంపై ఉత్తరఖాండ్, ఉత్తరప్రదేశ్‌లో హింస పేట్రేగిపోయింది. ముజఫర్‌నగర్‌లో ముస్లిం వ్యక్తిపై యాత్రికులు కొందరు దాడికి పాల్పడ్డారు. అతని కారు ధ్వంసం చేశారు. రాష్ట్ర యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో యాత్రికులకు

- మిగతా 2 లో

భారీగా తగ్గిన ర్యాంకర్ల సంఖ్య

- ఐదు మార్కులు కోల్పోయిన 4.2 లక్షల మంది
- నీట్ తుది ఫలితాలు విడుదల

న్యూదిల్లీ: నీట్ యూజీ 2024 తుది ఫలితాలను ఎన్‌టీఏ గురువారం విడుదల చేసింది. ఫిజిక్స్ విభాగంలోని ఓ ప్రశ్నకు ఒకటే సమాధానం ఉంటుందని నిపుణుల కమిటీ తేల్చడంతో దాని ఆధారంగా ఫలితాలను సవరించింది. 4.2 లక్షల మంది అభ్యర్థులు ఐదు మార్కులు కోల్పోయారు. దీంతో టాప్ ర్యాంక్

- మిగతా 2 లో

ఖనిజాలు, గనులపై రాష్ట్రాలు
రాయల్టీ విధించొచ్చు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ... కేంద్రానికి ఎదురుదెబ్బ

న్యూదిల్లీ: ఖనిజాలు, గనులపై రాష్ట్రాలు రాయల్టీ విధించే విషయంలో సుప్రీంకోర్టులో కేంద్రానికి ఎదురుదెబ్బ తగిలింది. ఖనిజాలు, గనులు కలిగిన భూములపై రాయల్టీ విధించే హక్కు రాష్ట్రాలకు ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు 8:1తో విస్తృత ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. ఖనిజాలు

- మిగతా 2 లో

భారీగా తగ్గిన ర్యాంకర్ల సంఖ్య

(మొదటిపేజీ తరువాయి)

సాధించిన వారి సంఖ్య కూడా 61 నుంచి 17కు తగ్గింది. సవరించిన ఫలితాలను విద్యార్థులు ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టారు. ఫిజిక్స్ విభాగంలోని అటామిక్ థియరీకి సంబంధించిన 29వ ప్రశ్నకు రెండు సమాధానాలు ఉన్నాయని, వాటిలో దేన్ని ఎంపిక చేసినా... మార్కులిచ్చారని ఆరోపిస్తూ ఓ అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం... ముగ్గురు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, నివేదిక అందించాలని ఐఐటీ-దిల్లీని ఆదేశించింది. ఈ క్రమంలోనే సంబంధిత ప్రశ్నకు ఒక సమాధానమే ఉందని, రెండు లేవని, ఆప్షన్ నాలుగు ఒక్కటే సమాధానమని నిపుణుల కమిటీ కోర్టుకు విన్నవించింది. దాంతో ఆప్షన్ 4ను ఎంచుకున్న అభ్యర్థులకే మార్కులు ఇవ్వాలంటూ ధర్మాసనం పరీక్ష నిర్వాహకులను ఆదేశించింది. ఫలితంగా మరోసారి సవరించిన ర్యాంకులను విడుదల చేయడం అనివార్యంగా మారింది. తాజాగా ఎన్‌టీఏ తుది ఫలితాలను వెల్లడించగా సుమారు 4.2 లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులు కోల్పోయారు. దీంతో మెరిట్ లిస్ట్ మారింది. అంతేకాదు.. 720కి 720 స్కోరు సాధించిన 61 మందిలో ఈ ప్రశ్నకు మార్కులు పొందిన వారు 44 మంది ఉన్నారు. వారి స్కోరు కూడా మారడంతో టాప్ ర్యాంకర్ల జాబితా 17కు తగ్గింది.

'కన్వర్' యాత్రికుల వీరంగం

(మొదటిపేజీ తరువాయి)

అధికార అండ ప్రస్ఫుటమైంది. తమ కావడిని కారు తాకిందన్నట్లు పుకార్లు సృష్టించి ఆకిబ్‌పై యాత్రికులు దాడి చేశారు. అవాస్తవాలు ప్రచారం చేస్తూ యాత్రికులు దాడులకు పాల్పడుతుండటాన్ని పోలీసులు గమనించారు. గత వారం రోజుల్లో ఇటువంటి చెదురు మదురుగా ఘటనలు చాలానే జరిగాయని తెలుస్తోంది.

అమన్ కుమార్ అనే దుకాణకారుడు తన బావమరిది మోనూతో కలిసి ఇంటికి వెళుతుండగా వారి బైకు తమ కావడిని తాకి అపవిత్రం చేసిందంటూ యాత్రికులు రెచ్చిపోయారు. అమన్, మోనూపై దాడికి తెగబడ్డారు. చేతికి అందిన కర్రలు తదితరాలతో చావబాదారు. దీంతో అమన్ ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటన సహరన్‌పూర్‌లో జరిగింది. ఉద్దేశపూర్వకంగా తాకలేదని, క్షమించాలని కోరినాగానీ యాత్రికులు కోపంతో ఊగిపోయారని, తన వాహనాన్ని ధ్వంసం చేశారని, కర్రలతో పాటు చేతికి ఏమి దొరికితే దాంతో కొట్టారని ఆయన తెలిపారు. 'బోలో శంకర్ భగవాన్ కీ జై' అంటూ నినాదాలు చేస్తూ రెచ్చిపోయారన్నారు. అక్కడే ఉన్న ఇద్దరు పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని అమర్ కుమార్ తెలిపారు. మాటశైలిని బట్టి హర్యానాకు చెందిన వారిగా గుర్తించినట్లు చెప్పారు. అమర్ కుమార్ ఫిర్యాదు మేరకు ఏడుగురు యాత్రికులపై హత్యాయత్నం, ప్రాణాంతక ఆయుధాలతో దాడి, అల్లర్లు సృష్టించడం తదితర ఆరోపణలతో ఎఫ్ఐఆర్ నమోదైంది. నిందితులను సచిన్, వినోద్, బిందర్, సుఖ్విందర్, జగ్‌దీప్, బుటా, కరణ్ సింగ్‌గా గుర్తించారు. ఈ ఘటనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నగర ఎస్పీ అభిమన్యు మాంగలిక్ వెల్లడించారు. అలాగే, హరిద్వార్‌లోనూ హింసాత్మక ఘటనలు జరిగాయి. కావడిని తాకి అపవిత్రం చేశారంటూ ఓ ఈ-రిక్షాను యాత్రికులు ధ్వంసం చేశారు. ఈ దాడి వీడియో బయటకు వచ్చింది. ఆరుగురికిపైగా యాత్రికులు దాడి చేయడం అందులో కనిపించింది. యాత్రికుల కల్పిత వాదనలంటూ ఎస్ఎస్పీ పర్మేంద్ర ధోబల్ తెలిపారు. మంగలౌర్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందని, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముజఫర్‌నగర్‌లోని మన్సూర్పూర్ ప్రాంతంలో పెట్రోల్ బంక్ సిబ్బందిపై యాత్రికులు దాడి చేసి గాయపర్చారు. అక్కడి కిటీల అద్దాలు ధ్వంసం చేశారు. మీనాక్షి చౌక్ ప్రాంతం సమీపంలో మతిస్థిమితం లేని వ్యక్తిపైనా యాత్రికులు వీరంగం సృష్టించారు. లాఠీలతో విచక్షణారహితంగా అతనిని కొట్టారు. దీనిపై సివిల్ లైన్స్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

సంగతేంటి?

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ జోక్యం చేసుకుని, కాంగ్రెస్ ఎంపీ తాను చేస్తున్న ఆరోపణలను ప్రామాణీకరించాలని చెప్పి సభను తప్పుదోవ పట్టించారన్నారు. తన ప్రసంగాన్ని అధికారపార్టీ సభ్యులు అడ్డుకున్నారని, ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని చన్నీ ఆరోపించారు. రైతులకు రుణమాఫీ సహా వివిధ డిమాండ్లు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న రైతులపై జాతీయ భద్రతా చట్టం నిబంధనలను ప్రయోగించారని దుయ్యబట్టారు. ఈ దశలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ... చన్నీ తన ఆరోపణలు ధృవీకరించాలని, ఆయన సభను తప్పుదారి పట్టించారని నిందించారు. చన్నీకి వ్యతిరేకంగా హక్కుల తీర్మానం ప్రవేశపెట్టాలని స్పీకర్‌ను కోరారు. కాగా చన్నీ తన ప్రసంగాన్ని ముగించిన తర్వాత కూడా అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఎన్సీపీ సభ్యుడు సునీల్ దత్తాత్రేయ తన ప్రసంగాన్ని ప్రారంభించగా, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ నిలబడి సభ్యుడి పక్కనే ఉన్న సీటును మంత్రిని తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంకా సీట్లు కేటాయించలేదని, మంత్రి ఎన్డీయే సభ్యులకు ఉద్దేశించిన సీటులో కూర్చున్నారని స్పీకర్ స్పష్టం చేశారు. దీంతో బెనర్జీ తాను కూడా వేరే సీటులో కూర్చుంటానని చెప్పి... అధికార పక్షం బెంచీల వైపు వెళ్లి కూర్చున్నారు. అనంతరం తిరిగి తన సీటుకు చేరుకున్నారు. ఆ తర్వాత సభలో గందరగోళం కొనసాగడంతో సభాపతి స్థానంలో ఉన్న జగదాంబిక పాల్ సభను మరోసారి వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ యథావిధిగా ప్రారంభమైంది.

వైసీపీ పాలనలో భూ కబ్జాలు

మంత్రి వాసంశెట్టి, మాజీ మంత్రి కేఎస్ జవహర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ పాలనలో రాష్ట్రంలో భూ కబ్జాలు జరిగాయని మంత్రి వాసంశెట్టి సుభాశ్, మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఆరోపించారు. పేద, బడుగు, బలహీన వర్గాల భూములనూ ఆ పార్టీ నేతలు కబ్జా చేశారన్నారు. మంగళగిరి కార్యాలయంలో టీడీపీ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో భాగంగా గురువారం వివిధ అర్జీలు స్వీకరించారు. వాసంశెట్టి, జవహర్ మాట్లాడుతూ, జగనన్న ఇళ్ల పేరుతో ప్రజలను దగా చేశారని విమర్శించారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా అధికారులను తొత్తులుగా చేసుకుని ఇష్టానుసారంగా ప్రవర్తించారని, పేదల ఇళ్లను కూల్చారని, బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. వైసీపీ బాధితులు అర్జీలతో పోటెత్తుతున్నారన్నారు. జగన్ పాలనలో ఎవరికి తమ గోడు చెప్పుకోవాలో తెలియక పేదలు చాలా నష్టపోయారన్నారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే సీఎం చంద్రబాబు ఆదేశానుసారం నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నామని వాసంశెట్టి, జవహర్ తెలిపారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం, ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలం, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి మండలం, కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

కొత్త తరానికి అవకాశమివ్వాలనే...

- అధ్యక్ష రేసు నుంచి వైదొలగడంపై జో బైడెన్
- కమలా హారిస్‌కు పెరుగుతున్న డెమొక్రాట్ల మద్దతు
- ఆమె అభ్యర్థిత్వాన్ని సమర్థించని ఒబామా
- అరిజోనా సెనేటర్‌కు ఛాన్స్‌పై ఊహాగానాలు

న్యూయార్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా భారత సంతతికి చెందిన కమలా హారిస్‌ను ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ప్రతిపాదించారు. కొత్త తరానికి అవకాశం ఇవ్వాలన్న అభిప్రాయంతోనే అధ్యక్ష బరి నుంచి తప్పుకున్నట్లు బైడెన్ వెల్లడించారు. తన ఈ నిర్ణయం దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు దోహదమవుతుందని అభిప్రాయపడ్డారు. 'దీర్ఘకాలం పాటు ప్రజా జీవితాలు గడిపేందుకు ఒక సమయం ఉంటుంది. అదే విధంగా కొత్త వారికి... యువ గళాలకు అవకాశం లభించే సమయం కూడా ఉంటుంది. అదిప్పుడు ఆసన్నమైంది. వర్తమాన నిర్ణయాలు దేశ భవిష్యత్‌కు, భావితరాలకు ప్రయోజనం చేకూర్చగలవని ఆకాంక్షిస్తున్నా' అని బైడెన్ అన్నారు. ఆయన ఓవల్ కార్యాలయం నుంచి జాతినుద్దేశించి వ్యాఖ్యానించారు.

కాగా, కమలా హారిస్ అభ్యర్థిత్వాన్ని దేశ మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా మద్దతు ప్రకటించలేదని న్యూయార్క్ పోస్టు పేర్కొంది. 'కమలా హారిస్ అభ్యర్థిత్వంతో ఒబామా నిరాశ చెందారు. ఆమె గెలవలేరని ఆయనకు తెలుసు. వలసదారులందరికీ ఆరోగ్య బీమా ఉండాలని చెప్పిన ఆమె ఎప్పుడు కూడా సరిహద్దులను సందర్శించలేదు. తన ముందున్న సవాళ్లకు ఎదురు నిలవలేరు' అని సన్నిహిత వర్గాలు చెప్పినట్టు న్యూయార్క్ పోస్టు కథనం పేర్కొంది. ఆరిజోనా సెనేటర్ మార్క్ కెల్లీకు డెమొక్రాట్ అధ్యక్ష అభ్యర్థిగా నిలబెట్టాలని ఒబామా కోరుకుంటున్నట్లు వెల్లడించింది. వచ్చే నెలలో జరిగే డెమొక్రాటిక్ పార్టీ జాతీయ సదస్సులో మార్క్ కెల్లీకు మద్దతు ఇవ్వాలని ఒబామా భావిస్తున్నట్టు తెలిపింది. మరోవైపు కమలా హారిస్ అభ్యర్థిత్వాన్ని ఒబామా ఆమోదిస్తారని ఎన్బీసీ న్యూస్ నివేదించింది.

19న డెమొక్రాటిక్ పార్టీ జాతీయ సమావేశం

డెమొక్రాట్ పార్టీ జాతీయ సమావేశం ఆగస్టు 19న చికాగాలో జరగబోతోంది. ఈ సమావేశాల్లో పార్టీ అధ్యక్ష అభ్యర్థిని అధికారికంగా ఎన్నుకోనున్నారు. 263 మంది డెమొక్రాట్ పార్టీ చట్ట సభ్యులు, 23 మంది గవర్నర్లలో ఇప్పటికే 178 మంది కమలా హారిక్‌కు మద్దతు తెలిపారు. అధ్యక్ష పదవికి నామినేషన్ కోసం 4,800 మంది ప్రతినిధుల్లో నుంచి 1,976 మంది మద్దతు అవసరం కాగా బైడెన్‌కు గతంలో 3,896 మంది మద్దతు లభించింది. బైడెన్ మద్దతు ఉండటంతో చికాగో సదస్సులో కమలా హారిస్ అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా ఆమోదించే అవకాశముంది. డెమొక్రాట్లలో 65శాతం మంది కమలా హారిస్‌కు మద్దతు తెలుపుతున్నట్టు మార్నింగ్ కన్సల్ట్ సర్వే వెల్లడించింది. అధ్యక్షుడిగా ట్రంప్‌నకు 47 శాతం, కమలా హారిస్‌కు 45 శాతం మంది మద్దతు ఇస్తున్నట్టు వెల్లడైంది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌ను ఓడించే సత్తా కమలా హారిస్‌కు ఉన్నట్లు పార్టీలో చాలా మంది విశ్వసిస్తున్నారు.

కమలా హారిస్ దూకుడు...

అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా తనకు బైడెన్ మద్దతు ప్రకటించిన వెంటనే కమలా హారిస్ విజృంభించారు. ట్రంప్‌పై ఎదురుదాడికి దిగారు. డేలావేర్‌లోని విల్మింగ్టన్‌లో పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడిన ఆమె గెలుపు మనదేనంటూ దీమా వ్యక్తంచేశారు. మహిళలను వేధించే వేటగాడు.. వినియోగదారులను కొల్లగొట్టే కేటుగాడు.. స్వలాభం కోసం నిబంధనలను అతిక్రమించే మోసగాడు... అంటూ ట్రంప్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

అనుకూలంగా సర్వేలు...

ఆలస్యంగా ఎన్నికల బరిలోకి దిగినా ఊహించని రీతిలో కమలా హారిస్‌కు మద్దతు పెరుగుతోంది. 'నేషనల్ ప్రెసిడెన్షియల్ పోల్' ఫలితాలు కమలా హారిస్‌కు అనుకూలంగా వచ్చాయి. రాయిటర్స్ పోల్‌లోనూ కమలా హారిస్ గెలుపును అంచనా వేశారు. ట్రంప్‌పై రెండు శాతం ఆధిక్యతను ఆమె సాధించగలరని సర్వే నివేదిక పేర్కొంది. కమలా హారిస్‌కు 44 శాతం మంది, డొనాల్డ్ ట్రంప్‌కు 42 శాతం మంది మద్దతు ఉన్నట్లు సర్వేలు పేర్కొన్నాయి.

కమలా హారిస్ కోసం విరాళాల వెల్లువ

డెమొక్రాట్ల పార్టీలో కమలా హారిస్‌కు క్రమంగా మద్దతు పెరుగుతోంది. పార్టీ అభ్యర్థి కోసం విరాళాలు సేకరించే యాక్ట్ బ్లూ సంస్థ... 46.7 మిలియన్ డాలర్లను కేవలం గంటలో సమీకరించింది. అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా కమలా హారిస్‌ను బైడెన్ ప్రతిపాదించిన 5 గంటల్లో చిన్న మొత్తాల్లో వచ్చిన విరాళాలే 27.5 మిలియన్ డాలర్లని యాక్ట్ బ్లూ వెల్లడించింది.

కేసుల ఎత్తివేతకు సీఎం హామీ హర్షణీయం: ఏపీటీఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు కోసం ఉద్యమాలప్పుడు ఉద్యోగులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇవ్వడంపై ఏపీటీఎఫ్ హర్షం వ్యక్తంచేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ హయాంలో సీపీఎస్ రద్దు కోసం చేసిన పోరాటాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను ఎత్తివేస్తామని చంద్రబాబు హామీనిచ్చారన్నారు. మాజీ సీఎం జగన్ సీపీఎస్‌ను రద్దు చేయకపోగా, సీపీఎస్‌పై ఉద్యోగ, ఉపాధ్యా వర్గాలు చేసిన ధర్నాలను అణచివేశారని, నాలుగు వేల కేసులు పెట్టారన్నారు. ఆ కేసులను ఎత్తి వేస్తామని ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నట్లు ప్రకటనలో నాయకులు పేర్కొన్నారు.

పోలవరానికి కొత్త డయాఫ్రమ్ వాల్

(మొదటిపేజీ తరువాయి)

వాల్ నిర్మించాలని విదేశీ నిపుణుల కమిటీ ఇటీవల తేల్చి చెప్పింది. దీంతో మంత్రివర్గ సమావేశం తీర్మానం కాపీని ఆమోదం కోసం నీతి ఆయోగ్‌కు పంపనున్నట్లు సమాచారం. అంతేకాకుండా పోలవరం ఎత్తు తగ్గించకుండా 45.06 అడుగులు నిర్మించాలని, నూతన డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా చేపట్టాలని కోరుతూ మంత్రివర్గ సమావేశం మరో తీర్మానం చేసినట్లు తెలిసింది. మంత్రుల పేషీల్లో ఎంత మంది సిబ్బందిని నియమించుకోవాలి? ఎన్ని పోస్టులు మంజూరు చేయాలి? వారి జీతభత్యాల గురించి కూడా మంత్రి వర్గ సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. పోస్టుల మంజూరుపై ఒకటి, రెండు రోజుల్లో జీఓ విడుదల చేయని పక్షంలో పేషీల్లో పనిచేసే ఉద్యోగులకు ఆగస్టులో జీతాలు వచ్చే పరిస్థితి ఉండదనే అభిప్రాయాన్ని మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో పాటు నామినేటెడ్ పోస్టులను ఆగస్టు మొదటి వారంలో భర్తీ చేసేందుకు కసరత్తు ప్రారంభించాలని మంత్రులు కోరినట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలు ఈనెల 26తో ముగియనుండటంతో 27న గవర్నర్ సమావేశాలను ప్రోరోగ్ చేయనున్నారు. 29న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై ఆర్డినెన్స్ తీసుకురావాలని మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు. మంత్రివర్గ సమావేశం అనంతరం జగన్ దిల్లీలో చేపట్టిన దీక్షపైనా, దానికి మద్దతు తెలిపిన ఇండియా ఐక్యసంఘటన పార్టీల అంశంపైనా చంద్రబాబు మంత్రులతో చర్చించినట్లు తెలిసింది.

రాబోయే ఏడాది నుంచి రైతులకు బీమా

వైసీపీ హయాంలో అస్తవ్యస్థం: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతుల కోసం ఖరీఫ్, రబీకి బీమా విధానాన్ని తీసుకొస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈ ఏడాది మాత్రం పాత విధానంతోనే రైతులకు బీమా విధానం అమలవుతుందని స్పష్టంచేశారు. గత ప్రభుత్వం 1,393.6 కోట్లు బీమా కంపెనీలకు చెల్లించలేదని, వాటి కోసం బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టనున్నామని చెప్పారు. శాసన మండలిలో పంటల బీమా బకాయిల చెల్లింపుపై సభ్యులు పర్చూరి అశోక్‌బాబు, తిరుమల నాయుడు, పంచుమర్తి అనురాధా అడిగిన ప్రశ్నలకు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు బదులిచ్చారు. అశోక్‌బాబు మాట్లాడుతూ 2019-24 మధ్యకాలంలో పంటల బీమా చెల్లించని విధానంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలపై విచారించాలన్నారు. భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పంటల బీమా లేకపోవడంతో రాయలసీమ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. ప్రభుత్వమే ప్రీమియం కడుతుందా... రైతులు చెల్లించాలా... ఇందులో ఏ విధానం రైతులకు మేలు కలుగుతుందనేదీ ప్రభుత్వం చెప్పాలన్నారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, పంటల బీమా పథకం సక్రమంగా అమలు జరగలేదని, పంటల బీమాను ఏ విధంగా అమలు చేస్తున్నారో తెలియక రైతులు గందరగోళంగా ఉన్నారని చెప్పారు. ఎన్టీఆర్‌జిల్లాల్లో మిర్చి పంటకు బీమా వర్తింపజేస్తే, గుంటూరుజిల్లాలోనే అదే రకం పంటకు ఇవ్వలేదని వివరించారు. వివిధ జిల్లాల్లో భూ కబ్జాదారులు సైతం పంటల బీమాను అనధికారికంగా పొందారన్నారు. బీమాపై అన్ని రైతు సంఘాలతో సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిఏటా ఖరీఫ్, రబీకి ఇన్సూరెన్స్ చేసి, సకాలంలో రైతులకు బీమా అందేలా చేశామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీమా అథోగతి పాలైందని విమర్శించారు.2019 తర్వాత ఒక్క ఖరీఫ్‌కే ప్రీమియం చెల్లించారని, రబీకి ఒక్క ఏడాదీ ప్రీమియం చెల్లించలేదని, దీంతో రబీలోని రైతులంతా ఇబ్బందులకు గురయ్యారని వివరించారు. 2022-23 రబీకి రూ.465 కోట్ల బీమా ప్రీమియం చెల్లిస్తేనే, రూ.96 కోట్లు వచ్చే అవకాశముందన్నారు. రబీకి రూ.1,267 కోట్లు కడితేనే 6.68లక్షల మందికి బీమా అందుతుందని చెప్పారు.

వేల ఎకరాల భూకబ్జా

(మొదటిపేజీ తరువాయి)

కఠినంగా శిక్షించాలని గాలి చంద్ర డిమాండ్ చేశారు. రెండు సెంట్ల భూమి ఆక్రమించుకొని...ఇళ్లు నిర్మించుకునే పేదలపై చర్యలు తీసుకునే అధికారులు వేల ఎకరాలు కబ్జా చేసినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. అధికారుల సహకారంతో నాయకులు ఎకరాలకు ఎకరాలు ఆక్రమించుకొని...కంచె ఏర్పాటు చేసి...చెట్లు నాటుకున్నా పట్టించుకోలేదన్నారు. ఎన్‌జీఓలకు కేటాయించిన స్థలాలు, ప్రజావసరాలకు సంబంధించిన స్థలాలను సైతం నాయకులు వదిలిపెట్టలేదన్నారు. ఆక్రమించుకున్న స్థలాల్లో ప్రహరీగోడలు నిర్మించి...భారీ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఈ మొత్తం భూ అక్రమాలపై సీపీఐ ఎప్పటికప్పుడు అధికారులకు వినతిపత్రాలు అందించిందని గుర్తుచేశారు. కబ్జాకు గురైన స్థలాలు ఏ గ్రామంలో...ఏ సర్వే నెంబరులో ఉన్నాయో గాలి చంద్ర వివరించారు.

కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖం, ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, బద్వేలు పట్టణ కార్యదర్శి పి.బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు పీవీ రమణ, రవికుమార్, విజయమ్మ, కేశవ, పెంచలయ్య, ఇమ్మానుయేలు, భగత్ సింగ్ కాలనీ కన్వీనర్ బి.అనిల్, నాయకులు నాగసుబ్బయ్య, సుబ్బారెడ్డి, ఏసన్న, ఓబులమ్మ, వెంకటయ్య, సలోమి, కుమారి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాలు రాయల్టీ విధించొచ్చు

(మొదటిపేజీ తరువాయి)

సమృద్ధిగా కలిగిన ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఈ తీర్పు వల్ల ప్రయోజనం చేకూరనుంది. ఇప్పుడు ఆ రాష్ట్రాలు తమ భూభాగంలో కార్యకలాపాలు నిర్వహిస్తోన్న సంస్థలపై అదనంగా మొత్తాన్ని వసూలు చేయడానికి వీలుకలగనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తాజా తీర్పు వెలువరిస్తూ రాయల్టీ, ట్యాక్స్ ఒకటి కాదని వ్యాఖ్యానించింది. అయితే తొమ్మిది మంది గల ధర్మాసనంలో ఎనిమిది మంది ఒకే రకమైన తీర్పు ఇవ్వగా... జస్టిస్ బీవీ నాగరత్న మాత్రం భిన్నమైన తీర్పు ఇచ్చారు. గనులు, ఖనిజాల నియంత్రణ, అభివృద్ధిపై పార్లమెంటుకు గంపగుత్త అధికారాన్ని రాజ్యాంగం కట్టబెట్టలేదని గత విచారణలో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రాష్ట్రాలకూ వాటిపై నియంత్రణాధికారం, అభివృద్ధి హక్కులుంటాయని తేల్చి చెప్పింది. ఖనిజాలపై పార్లమెంటుకున్న పన్ను విధించే అధికారం అనేది రాష్ట్రాల నియంత్రణాధికారాన్ని తుడిచిపెట్టేస్తోందని జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం-1957 (ఎంఎండీఆర్) ప్రకారం ఖనిజాలపై రాయల్టీని పన్నుగా పేర్కొనవచ్చని, దీనిపై పార్లమెంటుకు గంపగుత్త అధికారముందని మైనింగ్ కంపెనీల తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదించారు. దీనిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 1989లో ఇండియా సిమెంట్స్ లిమిటెడ్ వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసులో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం రాయల్టీని పన్నుగా గుర్తించవచ్చని తీర్పు చెప్పింది. అయితే 2004లో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం వర్సెస్ కేశోరాం ఇండస్ట్రీస్ లిమిటెడ్ కేసులో తీర్పు చెబుతూ 1989 నాటి తీర్పులో అచ్చుతప్పులు దొర్లాయని, రాయల్టీ... పన్ను కాబోదని స్పష్టంచేసింది. దీంతో రెండు విభిన్నమైన తీర్పులు రాగా... అప్పట్లో ఈ వివాదాన్ని తొమ్మిది మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి కోర్టు అప్పగించింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఫిబ్రవరిలో దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం మార్చిలో తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా తీర్పు వెలువరించింది.

అప్పు పది లక్షల కోట్ల పైనే !

(మొదటిపేజీ తరువాయి)

బిల్లుల్లో రూ.93 వేల కోట్లు సీఎఫ్ఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేయలేదని, రూ.48 వేల కోట్ల మేర బిల్లులు అప్‌లోడ్ చేసినా చెల్లింపులు చేయలేదని నిర్ధారించింది. భారీగా నీటిపారుదలశాఖ, పోలవరం బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు, ఇంకా వివిధ ప్రాజెక్టులకు చెందిన రూ.19,324 కోట్ల మేర బకాయిలు గుర్తించారు. ఆర్థిక శాఖ నుంచి రూ.19,549 కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో రూ.14 వేల కోట్లు, మున్సిపల్ శాఖలో రూ.7,700 కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయి. వివిధ కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలు, ఆస్తులు తనఖా పెట్టి తెచ్చిన అప్పులు, ఆర్బీఐలో బాండ్ల వేలం ద్వారా సేకరించిన రుణాలన్నీ కలిపి రాష్ట్ర అప్పు రూ.10 లక్షల కోట్లపైనే ఉంటుందని అధికారులు అంచనాకు వచ్చారు. ఈ వివరాలన్నీ శ్వేతపత్రం ద్వారా శుక్రవారం సీఎం చంద్రబాబు అసెంబ్లీ ద్వారా ప్రజలకు వివరించనున్నారు. ఆర్థిక శాఖాధికారులు పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేశారు.

నేరరహిత రాష్ట్రమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలోకి రాగానే నా ఇంటిపై డ్రోన్ ఎగురవేశారు. చలో ఆత్మకూరుకు పిలుపునిస్తే ఇంటిగేటుకు తాళ్లు కట్టారు. పవన్ కల్యాణ్ పై 7 కేసులు పెట్టారు. నోటీసులు ఇచ్చి విశాఖపట్నం నుండి బలవంతంగా పంపేశారు. నన్ను అరెస్టు చేసిన సమయంలో రాష్ట్రానికి వస్తుంటే రానివ్వకుండా సరిహద్దులో అడ్డుకున్నారు. దీంతో ఆయన రోడ్డుపైనే పడుకుని నిరసన తెలిపారు. మాచర్లలో టీడీపీ అభ్యర్థులను నామినేషన్ వేయనివ్వకుండా ఇబ్బందులు పెడుతుంటే బోండా ఉమా, బుద్దా వెంకన్న వెళ్లారు...వారిపై దాడి చేస్తే తప్పించుకుని వచ్చారు. యువగళం పాదయాత్రలో లోకేశ్‌కు మైకు ఇవ్వకుండా, బెంచి ఎక్కనివ్వకుండా ఇబ్బందులు పెట్టారు. ఇలా ఈసభలో ఉన్న వారందరిపై దాదాపు కేసులు బనాయించారు. పల్నాడు పులిగా పిలుచుకునే కోడెల శివప్రసాదరావుపై 18 కేసులు పెట్టి వేధించారు. ప్రభుత్వ ఫర్నిచర్ తిరిగి ఇవ్వలేదని కేసులు పెట్టారు. ఈ మాజీ సీఎంను అడుగుతున్నా....నీ ఇంట్లో ఇప్పుడు కూడా ప్రభుత్వ ఫర్నిచర్ ఉంది కదా...దానికి ఏం సమాధానం చెబుతావని చంద్రబాబు ప్రశ్నించారు. అలాగే హోంమంత్రి అనితపై అట్రాసిటీ కేసు, స్పీకర్ అయ్యన్నపాత్రునిపై రేప్ కేసు, అక్రమమైనింగ్‌పై ప్రశ్నించినందుకు దేవినేని ఉమా, ప్రశ్నాపత్రం లీక్ అంటూ నారాయణపై కేసులు పెట్టారన్నారు. రామతీర్థంలో రాముడి తల తీశారని ప్రశ్నించినందుకు అశోక్ గజపతిరాజుపై కేసులు పెట్టారని, పైల్స్ ఆపరేషన్ చేయించుకున్న అచ్చెన్నాయుడుని 600 కి.మీ తిప్పి జైల్లో పెట్టారని తెలిపారు. ఎంపీగా ఉన్న రఘురామకృష్ణరాజును అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారన్నారు. లాకప్ లో దారుణంగా కొట్టి, ఆ వీడియోలు చూసి జగన్ పైశాచిక ఆనందం పొందారని చంద్రబాబు తెలిపారు. ఇలా అనేకమంది నేతలపై కేసులు బనాయించారని... మంగళగిరి, గన్నవరం టీడీపీ కార్యాలయాలపైన, టెక్కలిలో జనసేన కార్యాలయంపైనా దాడి చేశారని గుర్తు చేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మా కార్యకలాపాలను అణచివేయడానికి జీవో-1 తీసుకొచ్చారని... ఇంట్లో నుండి బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారని తెలిపారు. టీడీపీతో పాటు జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ ఇల్లా అన్నిపార్టీల వారిపై ఎన్నో కేసులు పెట్టి వేలల్లో నాయకులు, కార్యకర్తల అక్రమ అరెస్టులకు పాల్పడ్డారని చెబుతూ... ఆయా సంఘటనలతో సహా కేసులు, అరెస్టుల వివరాలను వెల్లడించారు. ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీలపై ఇష్టానుసారంగా దాడులకు తెగబడ్డారని... ఎస్సీలు 192 మంది, ఎస్టీలు 58 మంది హత్యకు గురయ్యారని చెప్పారు. ఐదేళ్లలో మొత్తంగా 2,027 మంది మహిళలు హత్యకు గురయ్యారన్నారు. ఒక్క అమరావతి రైతుల్లో 269 మందిపైన క్రిమినల్ కేసులు పెట్టారు, 2,525 మంది రైతులను అరెస్టు చేశారని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో పెద్ద ఎత్తున అక్రమాలు, హింస, దాడులకు పాల్పడ్డారన్నారని... అన్ని చోట్ల ఇష్టానుసారంగా ఓట్లు గుద్దుకున్నారని...అందుకే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయకుండా బహిష్కరించామని చంద్రబాబు పేర్కొన్నారు. మరోపక్క దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా మూలాలు ఏపీలోనే ఉండటంతో పాటు మారుమూల గ్రామానికి వెళ్లినా గంజాయి దొరికే పరిస్థితి ఏర్పడిందన్నారు. నేరస్థుడు ముఖ్యమంత్రిగా ఉంటే ఏం జరుగుతుందో గత ఐదేళ్లు చూశామని సీఎం వివరించారు. జగన్ లాంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండటానికి అనర్హులని తెలిపారు. పోలీసు శాఖలో మార్పు తీసుకొస్తామని, కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలను వినియోగించకుండా ప్రజల్లో అవగాహన తీసుకొస్తామని చంద్రబాబు చెప్పారు. తన, మన అని చూడకుండా శాంతి భద్రతలు కాపాడటానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు.

హోదా సాధనకు కృషి చేయాలి

సీఎం చంద్రబాబుకు సీపీఎం విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రాభివృద్ధికి కీలకంగా ఉన్న ప్రత్యేక హోదా సాధనకు కృషి చేయాలని సీఎం చంద్రబాబుకు సీపీఎం ఏపీ నేతల బృందం విజ్ఞప్తి చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతోపాటు నేతలు ఎంఏ.గఫూర్, వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ బాబూరావు, కె.ప్రభాకర్‌రెడ్డి తదితరులు గురువారం ముఖ్యమంత్రిని కలిసి వివిధ సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విభజన అనంతరం రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, దానిని సరిదిద్దేందుకు ప్రత్యేక హోదా ఇస్తామని నాటి కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించిందని గుర్తుచేశారు. ఆ తర్వాత వచ్చిన మోదీ ప్రభుత్వం అప్పట్లో ప్రత్యేక హోదా ఇస్తామని వాగ్దానం చేసి... ఇప్పుడు ఇవ్వలేమని చెబుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధనపై ప్రధానంగా దృష్టి పెట్టాలని, విభజన హామీల సాధనకు కృషి చేయాలని చంద్రబాబును కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. రాష్ట్రంలో మతోన్మాదం పెచ్చరిల్లె ప్రమాదం ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమగ్రాభివృద్ధి కోసం వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమల స్థాపనకు, ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తికి ప్రాధాన్యతనివ్వాలని, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీలు సాధించాలన్నారు. పోలవరం నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం, రాజ్యాంగం 5వ షెడ్యూలు ప్రకారం భూమితో పాటు నష్టపరిహారం, పునరావాస ప్యాకేజీ ఇవ్వాలన్నారు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని ప్రణాళిక బద్ధంగా పూర్తి చేసి పరిపాలన సౌలభ్యంగా ఉండేలా చూడాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలకు అనుగుణంగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పోలవరం, స్మార్ట్ మీటర్లు, మద్యం, ఇసుక, భూదందాలు తదితర అంశాల్లో అవినీతిపై విచారించాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని సీపీఎం నేతలు కోరారు.

ఒంగోలు డెయిరీ పునరుద్ధరించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రకాశం జిల్లాలో 25వేల కుటుంబాలకు జీవనాధారమైన, ఆసియా ఖండంలోనే అతిపెద్ద రెండవ పాల కేంద్రం ఒంగోలు డెయిరీని ప్రభుత్వం పునరుద్ధరించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సీపీఐ ప్రకాశం జిల్లా సమితి అధ్వర్యాన ఒంగోలు డెయిరీని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ... 1975లో పాల సేకరణ కేంద్రంగా ప్రారంభమైన ఒంగోలు డెయిరీ 1994 నాటికి రెండున్నర లక్షల లీటర్ల పాలు సేకరించి స్థాయికి ఎదిగిందన్నారు. పాల రైతులు తమ కష్టార్జితంతో ఒంగోలు డెయిరీ ఏర్పాటు చేసుకున్నారన్నారు. 1987లో పాలపొడి కర్మాగారానికి శంకుస్థాపన జరిగిందని... స్థలానికి పాల రైతులు రూ. 19 లక్షలు విరాళంగా ఇచ్చారని తెలిపారు. డెయిరీ 2006 నాటికి రూ. 48 కోట్ల అప్పుల్లోకి వెళ్లడంతో ఎన్‌డీడీబీ స్వాధీనం చేసుకొని 2012 నాటికి అప్పులు తీర్చి డెయిరీని లాభాల బాటలో నిలిపిందన్నారు. 2014 వరకు లాభాల బాటలో నడిచిన డెయిరీని సహకార రంగం నుండి తప్పించి కంపెనీ యాక్ట్ లోకి తీసుకుపోవటంతో తిరిగి సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకొచ్చాక సీఎం జగన్ డెయిరీని అమూల్ కు అప్పగించడం ద్వారా పూర్తిస్థాయిలో విధ్వంసానికి శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. లీటర్ కు నాలుగు రూపాయలు అదనంగా రైతులకు ఆదాయం ఇప్పిస్తామని జిల్లాలోని అధికార యంత్రాంగాన్ని పాల రైతుల వద్దకు తిప్పించారన్నారు. అయితే నిర్వహణ సరిగా లేని అమూల్ పూర్తిస్థాయిలో చేతులు ఎత్తేసిందని చెప్పారు. పాల సేకరణ 3వేల లీటర్లకు పడిపోయిందన్నారు. మరోపక్క పాలపొడి ఫ్యాక్టరీలోని యంత్రాలు, ఇతర ప్రాసెసింగ్ యంత్రాలు మూలనపడి తుప్పుపట్టాయని చెప్పారు. ఒకప్పుడు జిల్లాలోని పాడి రైతులకు జీవనాధారంగా ఉన్న డెయిరీ పునః ప్రారంభం కోసం జిల్లా పాడి రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఒంగోలు డెయిరీకి తగిన నిధులు కేటాయించి, సహకార రంగంలోనే ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. దాదాపు రూ. 1000 కోట్ల ఆస్తులున్న డెయిరీని తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఒంగోలు డెయిరీకి 423 సహకార సంఘాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డెయిరీ పూర్వాధ్యక్షులు రామారావు, ఆచార్య రంగ కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, సీపీఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి చిట్టి పాటి వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి, సీపీఐ ఎంఎల్ నాయకురాలు ఎస్.లలిత కుమారి, ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వల్లం రెడ్డి రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ, రైతు సంఘ పోరాటఫలితం

గుంటూరు హైలెవల్ ఛానల్‌కు మరమ్మతులపై జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: గుంటూరు హైలెవల్ ఛానల్‌కు మరమ్మతులు ప్రారంభం కావడంపై సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి హర్షం వ్యక్తంచేశారు. గుంటూరు జిల్లాలోని 30 ఎకరాలకు సాగునీరు, 33 గ్రామాలకు తాగునీరు అందిస్తున్న ఛానల్‌ను బాగుచేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, రైతు సంఘం నాయకత్వంలో నిర్వహించిన పోరాటాల ఫలితంగా నేడు కాలువలో తూటాకు, గుర్రపుడెక్కను తొలగించే పనులు ప్రారంభమయ్యాయని జంగాల అజయ్ అన్నారు. కాలువపై ఉన్న చప్టాలు బలహీనపడి పగుళ్లు ఏర్పడటంతో గుంటూరుతో పాటు ఉండవల్లి, తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని తదితర ప్రాంతాల నుంచి మురుగునీరు ఈ కాలువలో కలుస్తోందన్నారు. చప్టాలకు మరమ్మతులు చేసి మురుగునీరు కలవకుండా చూడాలన్నారు. 47 కిలోమీటర్లు విస్తీర్ణం కలిగిన మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించే ఈ ఛానల్‌కు మరమ్మతులు జరుగుతుండటం సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సాధించిన విజయమని అన్నారు. ఇందుకోసం గతంలో ఇరిగేషన్ మంత్రిని, జిల్లా కలెక్టర్‌కు అనేకమార్లు వినతులు అందజేసినట్లు జంగాల అజయ్ గుర్తుచేశారు. కాగా, మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని కాజా గ్రామం వద్ద మరమ్మతు పనులను సీపీఐ, రైతు నాయకులు గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ, నాయకులు కంజుల విఠల్ రెడ్డి, కుసుం నాగిరెడ్డి, సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ముంపు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

చంద్రబాబుకు షర్మిల లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారీ వర్షాలతో వరద ముంపునకు గురైన రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ముంపునకు గురైన డ్రెయిన్ల అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు గురువారం ఆమె ఒక లేఖ రాశారు. వారం రోజులుగా కురిసిన భారీ వర్షాల ప్రభావంతో కోస్తా జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, కాలం చెల్లిన డ్రెయినేజీ వ్యవస్థ వల్ల వ్యవసాయ క్షేత్రాలు వరదబారిన పడ్డాయని పేర్కొన్నారు. దీంతో రైతులకు కోలుకోలేని పంట నష్టం వాటిల్లిందని వివరించారు. మంత్రివర్గ సహచరులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు... నష్టపోయిన ప్రాంతాల్లోని రైతుల కష్టాలను ప్రస్తావించకపోవడం నిరాశా జనకంగా మారిందన్నారు. నష్టాన్ని అంచనా వేయడానికి తక్షణమే అధికారుల బృందాలను నియమించాలని అన్నారు. గత ప్రభుత్వం డ్రెయిన్లు, కాల్వపూడిక తీత పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ధాన్యం సేకరించినా సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో వరదలతో బాధపడుతున్న రైతులపై మరింత భారం పడిందని, ఈ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని షర్మిల డిమాండ్ చేశారు.

ప్రపంచ బ్యాంక్ షరతులపై అప్రమత్తం

చంద్రబాబుకు ఈఏఎస్ శర్మ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: అమరావతి అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు, ఇతర సంస్థల నుంచి కేంద్రం ఇప్పిస్తున్న రూ.15 వేల కోట్ల అప్పుపై విధించే షరతులపై అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విశ్రాంత కార్యదర్శి ఈఏఎస్ శర్మ లేఖ రాశారు. రెండు రోజుల క్రితం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అమరావతి రాజధాని ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందిస్తామని పార్లమెంటులో ప్రకటించడం సంతోషదాయకమని... గతంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా, ప్రపంచ బ్యాంకు బోర్డు ఆఫ్ గవర్నర్‌లో భారతదేశం తరపున గవర్నర్‌గా ఉన్న అనుభవం ఆధారంగా చాలా విషయాలను మీ దృష్టికి తీసుకువస్తున్నానన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం, ఈ క్రింది విధంగా, కేంద్రం నుంచి ముందస్తు హామీలు తీసుకోవాలన్నారు. ప్రపంచ బ్యాంకు నుంచి వచ్చే నిధులు డాలర్ల రూపంలో ఉండటం వల్ల రుణభారం అధికంగా పెరిగే అవకాశం ఉందని, రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు... భవిష్యత్ లో రుణభారం ఎంతవరకు పెరగగలదో అంచనాలు వేసి, ఆ భారాన్ని తగ్గించే దిశలో కేంద్రం ఇప్పించే రూ. 15 వేల కోట్లలో ఎంత గ్రాంటుగా ఇవ్వాలి, ఎంత రుణంగా ఇవ్వాలి అనే విషయంపై కేంద్ర ఆర్థికశాఖ అధికారులతో చర్చించి ముందస్తు హామీ తీసుకోవాలని సూచించారు.

త్రిభాష సూత్రం దేశానికి శ్రేయస్కరం: యార్లగడ్డ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశానికి త్రిభాష సూత్రం శ్రేయస్కరమని విశ్వహిందీ పరిషత్ అధ్యక్షుడు, ఆచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ అన్నారు. హిందీ ప్రాంతీయులు ఏదో ఒక దక్షిణ భారతీయ భాషను నేర్చుకొనప్పుడే జాతీయ సమైక్యత సాధ్యమవుతందన్నారు. లేనిపక్షంలో హిందీ నేర్చుకోమని దక్షిణ రాష్ట్రాల వారికి సూచించే అర్హతను కోల్పోతారని సూచించారు. 'అరవింద్ ఘోష్-హిందీ' అంశంపై దిల్లీలోని ఎన్‌డీఎంసీ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన అంతర్జాతీయ హిందీ సమ్మేళనాన్ని యార్లగడ్డ గురువారం ప్రారంభించారు. హిందీ భాషను తమ మీద అనవసరంగా రుద్దుతున్నారనే భావన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం భాషలవారిలో ప్రభుత్వ మున్నదన్నారు. ఎవరు ఎన్ని భాషలు నేర్చుకుంటే అది వారికే మంచిదని యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ హితవు పలికారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి మేఘవాల్, పార్లమెంటు సభ్యులు సత్యనారాయణ్ జటియా, కేసీ త్యాగి, ఆర్‌కే సిన్హా అతిథులుగా రాగా... 500 మంది దేశ-విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు.

వేతనాలు చెల్లించండి

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆందోళన

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగంలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ కేడర్లలో పనిచేస్తున్న సిబ్బందికి 17 నెలలుగా గౌరవవేతనం అందకపోవడంతో గురువారం వారు ఆందోళనకు దిగారు. పురవీధులగుండా భారీర్యాలీ నిర్వహించారు. వీరు మాట్లాడుతూ... జిల్లాలో 430 మంది ఐసీఆర్పీలు, ఎంటీలు, సీఆర్పీలుగా తాము పనిచేస్తుండగా గత ఏడాది ఫిబ్రవరి నుంచి వేతనాలు ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు తప్ప చెల్లింపులు చేయడంలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నోసార్లు జిల్లా వినతిపత్రాలు అందజేసినా పరిష్కారంకాలేదన్నారు. 2015లో పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం పేరుతో ప్రారంభించిన ఈపథకంలో తామంతా చేరామని, 2020లో దీన్ని ఏపీసీఎన్‌అఫ్ గా మార్చారని తెలిపారు. రసాయనిక ఎరువులులేని సేంద్రీయ వ్యవసాయంలో కీలక భాగస్వామ్యం వహిస్తున్నామన్నారు. పకృతి వ్యవసాయ పంటలపై పెద్ద ఎత్తున రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇతర జిల్లాల నుంచి విచ్చేసి ఇక్కడే కుటుంబాలతో నివాసం ఉంటున్నామని, వేతనాలు అందక కుటుంబాన్ని పోషించలేక తీవ్రఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పిల్లలను చదివించలేక, ఆరోగ్యాన్ని కాపాడుకోలేక, కడుపునిండా తిండితినలేక పడుతున్న బాధలను వారు వివరించారు. తొలుత పార్వతీపురం జిల్లా కేంద్రంలో కాంప్లెక్స్ నుంచి పురవీధుల మీదుగా ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయంకు చేరుకున్నారు. అక్కడ కొద్దిసేపు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా రెవిన్యూ అధికారికి వినతి పత్రాన్ని అందజేసి తమ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నివిర్తి ప్రసాద్, వై. శ్రీరాములు, ఉర్లక నాగార్జున, పి.యశోధమ్మ, సింహాచలుడు, జి.స్వామినాయుడు, సురేశ్ కుమార్, మన్మథరావు, సన్యాసిరావు, వెంకటరమణ, ఇందిర పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సభలను విజయవంతం చేయండి: రావులపల్లి

విశాలాంధ్ర బ్యూరో-కడప: సెప్టెంబరు ఒకటి, రెండు, మూడు తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనంను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం ఏఐటీయూసీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. రావులపల్లి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్బంధాలను,ఎస్మాలను తలదన్ని అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు రాష్ట్రంలో వీరోచిత పోరాటం సాగించారన్నారు. నాటి హామీలను టీడీపీ కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు జరపాలని కోరారు. గత 30 సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఎల్‌పీజీ విధానాలు అమలు జరుపుతున్న ఫలితంగా కార్పొరేట్ బడా పారిశ్రామిక వర్గం రాజ్యమేలుతుందన్నారు. పనిభద్రత కరువైంది. కార్మిక చట్టాలన్నీ చట్టుబండలై పోతున్నాయని,కాంట్రాక్టు, ఔట్సో ర్సింగ్, రోజువారీ కూలీ విధానాలు అతి కర్కశంగా అమలు జరుగుతున్నాయన్నారు . మెరుగైన వేతనాలు, పెన్షన్, విద్య, వైద్య సౌకర్యాలు మృగ్యమైపోతున్నాయి. కోట్లాదిమంది అసంఘటిత రంగ కార్మికులు, ప్రభుత్వ స్కీమ్ ఉద్యోగులను కట్టుబానిసలుగా మార్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. 2024-25 కేంద్ర బడ్జెట్ వేతన జీవులను నిరాశపరిచిందని అన్నారు. ఈ నేపథ్యంలో నిత్యం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాలని కార్మిక వర్గానికి పిలుపు ఇచ్చారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు దేవేంద్ర, వెంకటేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

ఏలూరులో సీపీఐ, సీపీఎం ధర్నా

విశాలాంధ్ర-ఏలూరు: ఏపీ ఎంపీల మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్న బీజేపీ... రాష్ట్రానికి అన్యాయమే చేస్తోందని సీపీఐ, సీపీఎం విమర్శించాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందని నిరసిస్తూ గురువారం ఉదయం ఏలూరు పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ ఏలూరు సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షత జరిగిన ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ , ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పీ కిషోర్ మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్ ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసే విధంగా ఉందని దుయ్యబట్టారు. 2014 నుంచి రాష్ట్రానికి ప్రత్యేక హెూదా అమలు చేయకపోగా, గడిచిన పదేళ్లలో విభజన చట్టం హామీలేవీ కేంద్రంలోని మోదీ సర్కారు అమలు చేయలేదని విమర్శించారు. తాజాగా అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ప్రపంచ బ్యాంకు తదితర సంస్థల నుండి అప్పు ఇప్పించడానికి సహకరిస్తామని మాత్రమే ప్రకటించడాన్ని తప్పుబట్టారు. పోలవరం ప్రాజెక్టు, వెనకబడిన జిల్లాల అభివృద్ధికి సహకరిస్తామన్నారే కానీ నిధులు ఊసే లేదన్నారు. కానీ కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఏదో మేలు జరిగిపోయినట్లు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేయటం సిగ్గుచేటని వారన్నారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర ధరల నియంత్రణ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం నిర్దిష్ట హామీలేవీ కేంద్ర బడ్జెట్లో లేవని ఆయన విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పీవీ రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత లేదన్నారు. ఉపాధి హామీ పథకం నిధుల్లో భారీగా కోత విధించారని తెలిపారు. కేంద్ర బడ్జెట్ మేడిపండులా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబీ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని,ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు కొల్లూరి సుధారాణి, మాపూరి విజయ, ఎం ఏ హకీమ్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, తెర్లాపు శ్రీను, పార్టీ సభ్యులు కొండేటి రాంబాబు, సాయన అఖిలాష్ కుమార్, గొర్లి స్వాతి, ఉప్పులూరి లక్ష్మి, భవాని, జ్యోతి మేరీ, రషీద్, సీపీఎం నాయకులు బీ జగన్నాథరావు, జి.రవి కిషోర్, వైఎస్ కనకారావు , ఎం.ఇసాక్, కోటేశ్వరరావు, జీ శారద, మీసాల సత్యం, సీహెచ్ పయిడియ్య, ఠాగూర్ రాజా, ఏసుబాబు, రాజశేఖర్, సిద్ధార్థ, మొహిద్దీన్ పాల్గొన్నారు.

పరిశీలనలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

శాసన మండలిలో రవాణా శాఖ మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో (సూపర్ సిక్స్) హామీ కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంశం ఇంకా పరిశీలనలోనే ఉందని రవాణా శాఖ మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి చెప్పారు. విధి విధానాలు రూపొందించాల్సి ఉందని పేర్కొన్నారు. శాసన మండలిలో సభ్యులు పోతుల సునీత, వరుదు కల్యాణి, ఎస్.గంగమ్మ గురువారం అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీపై ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో అధికారుల బృందాలు వెళ్లి, అక్కడి అమలు విధానంపై అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 1,450 బస్సులు రోడ్లపైకి తెచ్చేందుకు చర్యలు తీసుకుందన్నారు. విద్యుత్ బస్సుల ఏర్పాటు లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు.

మైనింగ్ అక్రమాలపై నిగ్గు తేలుస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మైనింగ్ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విశాఖజిల్లా భీమిలి బీచ్ దగ్గర మైనింగ్ అక్రమాల తవ్వకాలపై చర్యలు తీసుకుంటామని అన్నారు. తొలుత శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ప్రైవేట్ ఏజెన్సీలకు మోనజైట్, సిలికాన్‌ల అనధికారిక విక్రయం అంశంపై సభ్యులు దువ్వారపు రామారావు, భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, వేపాడ చిరంజీవిరావు, బి.తిరుమల నాయుడు మాట్లాడారు. దువ్వారపు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అనుమతులు లేకుండా భీమిలి ఇసుక బీచ్‌లలో మోనజైట్, సిలికాన్‌లలో అక్రమంగా తవ్వకాలు కొనసాగుతున్నాయన్నారు. రామ్‌భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ, అన్నమయ్యజిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని మంగంపేట బైరైటీస్ గనుల నుంచి ఐదేళ్లుగా విచ్చలవిడిగా ఖనిజాలను దోపిడి చేశారన్నారు. 400 మందిని అవుట్ సోర్సింగ్ పనులను నియమించుకుని, వారిని విధులకు వెళ్లనీయకుండా వైసీపీ పనులకు వినియోగించుకున్నారన్నారు. వందలాది కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని, వాటిపై కేంద్ర దర్యాప్తు సంస్థలో విచారించాలని కోరారు. దీనిపై మంత్రి కొల్లు మాట్లాడుతూ, మంగంపేటలోని బైరైటీస్‌ను ఏ, బీ గ్రేడ్ కింద ప్రస్తుతం 30 లక్షల మిలియన్ టన్నుల సామర్థ్యం గల గనులు అందుబాటులో ఉన్నాయని మంత్రి చెప్పారు. వాటిని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏంఒయూలో ఒక రకంగాను, ఆ తర్వాత మరొక రకంగాను వ్యవహ రించారని తెలిపారు. ఏ గ్రేడ్ ఎంఒయూలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశిస్తామన్నారు. ఎంఒయూ అవ్వకుండానే 77వేల టన్నులను ఎత్తేశారని ఆరోపించారు. ఇలా బీ, సీ గ్రేడ్ రకంలోను అవకతవకాలు జరిగాయని చెప్పారు. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున మైనింగ్‌లో రూ.20 వేల కోట్ల దోపిడీ జరిగిందన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఇష్టానుసారంగా నియమించిన విధానంపైనా ఆరా తీస్తామని చెప్పారు.

జిల్లాకో వ్యర్థాల రీ సైక్లింగ్ యూనిట్: పవన్ కల్యాణ్

రాష్ట్రంలో వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసేందుకుగాను జిల్లాకు ఒక యూనిట్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సభ్యులు వంకా రవీంద్రనాథ్, కేఎస్ లక్ష్మణరావు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలలో రాష్ట్రం 12వ స్థానంలో ఉందని పవన్ చెప్పారు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తొలగించేందుకుగాను ఆరు రీ సైక్లింగ్ యూనిట్లు ఉండగా, రాబోయే కాలంలో వాటిని జిల్లాకు ఒకటి చొప్పున విస్తరింపజేస్తామనిచెప్పారు.

వైసీపీ హయాంలో ఖజానా దివాళా: నాదెండ్ల మనోహర్

వైసీపీ హయాంలో వ్యవసాయరంగ ఖజానా మొత్తం దివాళా తీసిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రైతులకు చెల్లించాల్సిన బకాయిల్లో తొలుత రూ.674 కోట్లను త్వరలో చెల్లిస్తామన్నారు. శాసన మండలిలో ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, తూమాటి మాధవ్‌రావు, డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. ఉభయ గోదావరిజిల్లాల్లో రైతులకు బకాయిలను చెల్లిస్తామన్నారు. గత ప్రభుత్వ అప్పులను తాము తీర్చాల్సి వచ్చిందన్నారు. తొలుత పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, గతంలో కూరగాయల ధరలను నియంత్రించడంలో రైతు బజార్లు ముఖ్యమైన పాత్ర పోషించగా, నేడు దానికి విభిన్నంగా ఉందన్నారు. గుంటూరుజిల్లా రైతు బజారును మంత్రి నాదెండ్ల మనోహర్ ఒక్కసారి సందర్శించి, రైతు బజార్ల నిర్వహణ, పాలనను మెరుగుపర్చాలని చూసించారు. ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అమలాపురంలో రైతు బజారును పునరుద్ధరించాలని, రైతు బజారులలో ధరలను అమలు చేయాలన్నారు. పౌర సరఫరాలో పంపిణీ చేస్తున్న కందిపప్పు నాణ్యత లేదని, దానిపై విచారించాలన్నారు. 22 నిత్యవసర ధరల సరుకులపై కేంద్ర ప్రభుత్వం ఒక మొబైల్ ఏర్పాటు చేసిందన్నారు. విజయవాడ, విశాఖ, జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లో ప్రధాన నిత్యావసర ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కందిపప్పు, బియ్యం ధరల తగ్గింపునకు చర్యలు ప్రారంభించామన్నారు. రూ.181 ఉన్న కంది పప్పు రూ.160, బియ్యం రూ.56 ఉండగా 49కే అందించేందుకు వ్యాపార సంస్థలు ముందుకు వచ్చాయని చెప్పారు. బ్లాక్ మార్కెటింగ్ నియంత్రణపై దృష్టి కేంద్రీకరించా మన్నారు. ఎక్కడా 20 మెట్రిక్ టన్నులు మించి పప్పు ధాన్యాలు ఉంచకూడదని నిబంధనలు విధించామని, బ్లాక్ మార్కెటింగ్ కట్టడికి క్షేత్రస్థాయిలో చర్యలు ఆరంభించామని వివరించారు. దీనిపై మంత్రి నాదెండ్ల మనోహర్ బదులిస్తూ, రైతు బజార్ల ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పరిశీలనలోనే... సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు

జీవో 107, 108 రద్దుపై మంత్రి సత్యకుమార్ మౌనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నూతన వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద (బి.కేటగిరి) భర్తీ చేసే జీవోలు 107, 108 రద్దు చేయాలని శాసన మండలిలో సభ్యులు సూచించగా, అది ఇంకా పరిశీలనలోనే ఉందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్పష్టంచేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా మంజూరైన ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద (బి.కేటగిరి) 35 శాతం సీట్లను కేటాయించడంతో ప్రతిభ, రిజర్వేషన్ విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని విద్యార్థి, యువజన సంఘాలు ఉద్యమిస్తున్నాయి. దీనిపై శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఇసాక్ బాషా, తూమాటి మాధవరావు, కుంభా రవిబాబు, పర్చూరి అశోక్‌బాబు, పీడీఎఫ్ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు తమ ప్రశ్నల ద్వారా సమస్యను లేవనెత్తారు. లక్ష్మణరావు మాట్లాడుతూ, రెండో దశ, మూడో దశలోని వైద్య కళాశాలలు ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయని ప్రశ్నించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ, ఒక వైద్యుడు వృత్తి కోసం రూ.60లక్షలు ఖర్చుచేసి, బయటకు వచ్చాక అదే స్థాయిలో ప్యాకేజీతో ప్రైవేట్ రంగంలోకి వెళ్లిపోతున్నారన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లోకి రాకపోవడం దురదృష్టకరమని చెప్పారు. పీడీఎఫ్ సభ్యుడు ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కొత్త వైద్య కళాశాలల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా సెల్ఫ్‌ఫైనాన్స్ కింద ఫీజులు పెట్టారని, వాటిపై 107, 108 ఉత్తర్వులను టీడీపీ ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. వాటిపై మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ, కొత్తగా ప్రభుత్వ వైద్యకళాశాలు వచ్చినప్పటికీ, బోధనా సిబ్బంది, నిర్వహణ బాధ్యతల వ్యయం పెరిగిపోవడంతో గత ప్రభుత్వం సెల్ఫ్‌ఫైనాన్స్ కోటాను ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులు సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని తొలగించాలని సూచించగా, దానిపై ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. వైద్య కళాశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పన, ఫ్యాకల్టీల నియామకంపై పెద్దఎత్తున దృష్టి పెట్టామని చెప్పారు.

పులివెందులలో ఇళ్ల కేటాయింపుపై విచారిస్తాం: మంత్రి కొలుసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో అనర్హులకు ఇళ్ల కేటాయింపులపై సమగ్ర విచారణ చేపడతామని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నియోజకవర్గంలో 19,700 ఇళ్లు మంజూరు చేశారని, స్థానికేతరులు, అర్హతలు లేని వారికి ఇళ్లు ఇచ్చారనే ఆరోపణలపై అధికారులతో ఒక కమిటీ వేశామన్నారు. కమిటీ నివేదిక వచ్చిన వెంటనే వారిని తొలగిస్తామని, అనర్హులకు ఉద్దేశ్యపూర్వకంగా కేటాయించినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. పులివెందుల గృహనిర్మాణ ప్రాజెక్టులో అనర్హులైన లబ్ధిదారుల అంశంపై శాసన మండలిలో సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి మాట్లాడారు. ఆధార్ నంబరు లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేశారని, ధన వంతులకూ లబ్ధిదారులకు చోటుకల్పించారని, 368 ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్లు మంజూరు చేశారని వివరించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇళ్లు ఇవ్వాలన్న ప్రయత్నంతో, స్థానికేతరులకు సైతం ఇక్కడ ఇళ్లు ఇచ్చారన్నారు. అక్కడ రెండువేల మంది నకిలీ లబ్ధిదారులు ఉన్నట్లు తేలిందన్నారు. పులివెందుల మున్సిపాల్టీ కాలనీలోనే రూ.150 కోట్ల అవినీతి జరిగిందనేదీ విచారణలో తేలిందన్నారు. గతంలో దీనిపై అధికారుల దృష్టికి తాను తీసుకొచ్చినప్పటికీ... వారు స్పందించలేదన్నారు. ఇది ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని చెప్పారు. ఇందులో భాగస్వాములైన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు టిడ్కో ఇళ్లను ప్రతిష్టాత్మకంగా నిర్మించగా, 99 శాతం పూర్తయ్యాయని చెప్పారు. జగన్ అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్లను పక్కన పెట్టిందని విమర్శించారు. 3 లక్షల 30వేల టిడ్కో ఇళ్లను తాకట్టు పెట్టి, రూ.10 లక్షల కోట్ల రుణాలను తీసుకొచ్చిందన్నారు. వాటిపై మంత్రి పార్థసారథి మాట్లాడుతూ పులివెందులలో అవినీతి జరిగినట్లు రుజువైతే... అందుకు బాధ్యులైన అధికారులపైనా చర్యలుంటాయని తేల్చి చెప్పారు.

సంపాదకీయం

రాహుల్ దిద్దిన కొత్త ఒరవడి

భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీలో బిడియం, అనాసక్తత మాయమైపోయినాయి. ఇటీవల ప్రతిపక్ష నాయకుడైన తరవాత, ముఖ్యంగా ప్రతిపక్షాల బలం పదేళ్ల తరవాత గణనీయంగా పెరిగిన నేపథ్యంలో రాహుల్ గాంధీ రాజకీయాలకు ఉన్న అడ్డుకట్టలన్నీ తొలగిపోయాయి. పార్లమెంటు లోపల, వెలుపల ఆయన ప్రసంగాల్లో పరిణతి పదునెక్కింది. బుధవారం ఆయన దాదాపు డజను మంది రైతు నాయకులను పార్లమెంటుకు ఆహ్వానించి ప్రతిపక్ష నాయకుడిగా తనకు కేటాయించిన గదిలో సమావేశమయ్యారు. రోడ్డెక్కిన వివిధ ఆందోళనకారులతో ప్రభుత్వాధినేతలు, ప్రతిపక్ష నాయకులు చర్చించిన సందర్భాలు ఉండొచ్చు. ఆందోళన చేస్తున్నవారితో మమేకమైన ప్రతిపక్ష నాయకులకు లెక్కేలేదు. వివిధవర్గాల ప్రజల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించి వాటిలో కొన్నింటినైనా పరిష్కరించడానికి కారకులైన ప్రతిపక్ష నాయకులూ ఉండొచ్చు. బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, అరకొరగానైనా భూసంస్కరణల అమలు లాంటి ప్రగతిశీల విధానాలు రూపొందడానికి ప్రతిపక్షాల, ముఖ్యంగా కమ్యూనిస్టుల నిరంతర పోరాటాలే ప్రధాన కారణం. ప్రతిపక్ష నాయకుడి పని ఓ మంత్రికి ఉండే సదుపాయాలు అనుభవించడంతో అంతం కాదు. అధికారపక్షం బాధ్యతాయుతంగా వ్యవహరించనప్పుడు ఆ పక్షాన్ని బోనెక్కించి, జవాబుదారుగా నిలబెట్టడంలో ప్రతిపక్ష నాయకుడి పాత్ర చాలా కీలకం. అలా నడుచుకున్న ప్రతిపక్ష నాయకులు గతంలో కూడా ఉన్నారు. సంఖ్యాబలంతో నిమిత్తం లేకుండా ప్రతిపక్ష నేతల మాట చెవిన పెట్టిన అధికారపక్ష నాయకులూ ఉన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత అంతా ఏకపక్షమే. ఆయన మంత్రివర్గ సభ్యుల్లో చాలామంది నిగమశర్మ అక్క స్థాయి దాటనే లేదు. పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి అధికారపక్షం చేయని ప్రయత్నం లేదు. నిష్పక్షపాతంగా మెలగాల్సిన సభాపతులు కూడా అధికారపక్షంతో కుమ్మక్కు అయిపోయి ప్రతిపక్షాల పీక నొక్కిన సందర్భాలు గత పదేళ్లలో కొల్లలుగా ఉన్నాయి. సాహసించి ఏ ప్రతిపక్ష నాయకుడైనా పార్లమెంటులో మాట్లాడితే, సభాపతులు వారి మైక్ కట్టేస్తారు. ఆ నాయకుడి మాటల్లో ప్రభుత్వానికి అననుకూలమైన మాటలను రికార్డుల నుంచి తొలగించిన సందర్భాలు ఎన్నో. కానీ మొన్నటి ఎన్నికల తరవాత అధికారపక్షం బలం విపరీతంగా కుదించుకు పోయింది. ప్రతిపక్షాలబలం గణనీయంగా ఉంది. అందువల్ల రాహుల్ గాంధీతో సహా ప్రతిపక్ష నాయకులు గొంతెత్తగలుగుతున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ ప్రసంగం అందరి దృష్టినీ ఆకర్షించింది. లోక్‌సభలో మూడవ పెద్ద పార్టీగా అవతరించిన సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా కూడా అడుగడుగునా సమర్థంగా, అర్థవంతంగా ప్రభుత్వపక్ష వితండవాదనలను, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడ్తున్నారు. మన పార్లమెంటు మీద మళ్లీ ఆశలు చిగురిస్తోంది.

రాహుల్ గాంధీ మారిన ఈ పరిస్థితిని వినియోగించుకుని దాదాపు నాలుగేళ్లుగా నిరంతరం పోరాడుతున్న రైతు సంఘాల ప్రతినిధులను పార్లమెంటుకు ఆహ్వానించి, ప్రతిపక్ష నేతగా తనకు కేటాయించిన గదిలో చర్చించి కొత్త ఒరవడి దిద్దారు. రోడ్డుమీద కనిపించే ఉద్యమ నాయకులు పార్లమెంటులో కాకపోయినా పార్లమెంటు ఆవరణలో తమ వాదన ప్రతిధ్వనించేలా చేయగలిగారు. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటకకు చెందిన రైతు సంఘాల నాయకులు పార్లమెంటు భవన ప్రాంగణంలో రాహుల్ గాంధీతో తమ సమస్యల మీద చర్చించగలిగారు. వారిని రాహుల్ గాంధీనే పార్లమెంటులోకి ఆహ్వానించారు. కానీ భద్రతా సిబ్బంది వారిని లోపలికి అనుమతించలేదు. ఈ లోగా ద్వారం దగ్గరికి వెళ్లి వారితో మాట్లాడాలని రాహుల్ అనుకున్నారు. ఈ లోగా సభాపతికో, పార్లమెంటు సిబ్బందికో జ్ఞానోదయం అయి రైతు సంఘాల నేతలను లోపలికి రానిచ్చారు. బడ్జెట్ ప్రతిపాదించిన మరుసటి రోజే ఈ సంఘటన జరగడం విశేషం. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ కూడా రైతుల దీర్ఘ కాలిక డిమాండ్లను పట్టించుకోలేదు. బడ్జెట్ ప్రసంగంలో అసలు సమస్యల ఊసే లేదు. అందుకే రైతు సంఘాల నాయకులు బడ్జెట్ ప్రతులను దగ్ధం చేయాలని సంకల్పించారు. 2020-2021 సంవత్సరాలలో దిల్లీ సరిహద్దుల్లో పదమూడు నెలలకు పైగా బైఠాయించారు. ఉద్యమక్రమంలో దాదాపు 700 మంది రైతుల ప్రాణాలు బలై పోయిన తరవాత 2021 నవంబర్ 19న ప్రధానమంత్రి మోదీ వివాదాస్పదమైన మూడు సేద్య బిల్లులను వెనక్కు తీసుకుంటునట్టు ప్రకటించారు. రైతుల డిమాండ్లను పరిష్కరించడానికి అవకాశాలను పరిశీలించడానికి ఓ కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కమిటీ ఏర్పాటు చేయడానికి మోదీ ప్రభుత్వానికి తొమ్మిది నెలలు పట్టింది. కేంద్ర వ్యవసాయ శాఖ మాజీ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ అధ్యక్షతన 29 మందితో చివరకు కమిటీ ఏర్పాటు అయింది. దిల్లీ సరిహద్దుల్లో రైతుల బైఠాయింపు జరిగినప్పుడు ఈ ఆందోళనలో దేశమంతటి రైతులు పాల్గొనడం లేదని మోదీ ప్రభుత్వం ప్రచారం చేసింది. కేవలం పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లోని కొంత ప్రాంతం రైతులే ఉద్యమంలో పాల్గొంటున్నారని అసత్య ప్రచారం చేసింది. విచిత్రం ఏమిటంటే సంజయ్ అగర్వాల్ కమిటీలో పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ రైతుల ప్రతినిధులే లేరు. రైతుల ప్రధానమైన కోరిక కనీస మద్దతు ధరకు చట్ట ప్రతిపత్తి కల్పించాలనే 1920-21 ఉద్యమం సందర్భంగా రైతు నాయకుల మీద పెట్టిన కేసులు ఎత్తి వేయాలని, లఖిం పూర్ ఖేరీలో కేంద్ర హోం శాఖ సహాయమంత్రి అజయ్ మిశ్రా తేనీ కుమారుడు రైతుల మీద నుంచి వాహనాలు నడిపించి అయిదుగురు రైతుల ప్రాణాలను పొట్టనపెట్టుకున్నందున దీని మీద చర్యతీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కనీస మద్దతు ధరకు చట్ట ప్రతిపత్తి కల్పించడానికి మోదీ ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి నిరాకరిస్తూనే ఉంది. రైతుల డిమాండ్లపై 2022 లో కుదిరిన కొన్ని ఒప్పందాల అమలుకు ఇప్పటికీ దిక్కు లేదు. రైతులు దిల్లీ పొలిమేరలు దాటకుండా ప్రభుత్వం రోడ్ల మీద అడ్డంకులు పెట్టడమే కాదు, ముళ్లకంచెలు వేయించింది. మేకులు నాటించింది. కందకాలు తవ్వించింది. సరిహద్దు దగ్గర ఉన్న వారితో యుద్ధం చేస్తున్నట్టుగానే మోదీ ప్రభుత్వం భావించింది. 2020నాటి విద్యుత్ బిల్లును ఉపసంహరించనే లేదు. ఉద్యమం ఒక కొలిక్కి రాకపోవడంతో గత ఫిబ్రవరిలో రైతులు మళ్లీ దిల్లీ రావాలనుకున్నారు. వారిని పంజాబ్, హర్యానా సరిహద్దు అయిన శంభు ప్రాంతంలోనే ఆపేశారు. అప్పటి నుంచి భారీ సంఖ్యలో కాకపోయినా అక్కడే రోడ్ల మీదే బైఠాయించారు. 2020-2021 బైఠాయింపు సమయంలో సింఘు, ఘాజీపూర్, తిక్రీ ప్రాంతాలు సాక్షాత్తు రణ క్షేత్రాలుగా తయారయ్యాయి. మొన్నటి ఎన్నికలకు ముందు ఎన్నికల ప్రణాళికలో తాము అధికారంలోకి వస్తే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇది రైతులలో ఆశ రేకెత్తించింది. అందుకే రైతు సంఘాల నాయకులు పార్లమెంటు ఆవరణలో రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తామని రాహుల్ రైతు ప్రతినిధులకు హామీ ఇచ్చారు. రైతులు ఆశ ప్రతిపక్షాల మీదే.

పార్టీల పనితీరు ఇదేనా?

తిట్టుకోవడం అయిపోయిందా యిక కొట్టుకోండి కసి తీరకపోతే నరుక్కోండి. అప్పుడుగాని ఆయా పార్టీలు యువతకు ఆదర్శంగా మారగలరు. ఏంటి బావ నరుక్కోండి తిట్టుకోండి అంటున్నావు ఎవరినుద్దేశించి? నువు పేపరు ఆసాంతం చదువుతావు, ఎరగనట్లు నన్ను అడుగుతావ్. అది సరే లేవయ్యా ఇప్పుడు కొత్తగా ఎవరు కొట్టుకున్నారు. అదేంటయ్యా పెద్ద పార్టీలు రెండు తమ నాయకులను, కార్యకర్తలను ఎదుటివారు కొట్టి చంపుతున్నారని ఒకరిపై ఒకరు ఆరోపణలతో పేపరు కెక్కుతున్నారుగద నిజమే. అంతటితో ఆగక జగన్ కేంద్ర బృందంతో దర్యాప్తు జరిపించాలని ప్రధాని మోదీ, అమిత్ షా తోపాటు రాష్ట్రపతికి కూడ విన్నవించుకున్నాడు గద. ఇటీవల పుంగనూరులో జరిగిన అల్లర్ల విషయంలో ఆయన కేంద్రాన్ని కోరాడు. కార్లు తగలుబడినై రాళ్లు రప్పలు చాలక కర్రలు కత్తులతో ఒకరిపై ఒకరు చంపుకునే ఉద్రిక్తత చోటు చేసుకుంది గద. అసలు నా కర్థంకాదు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసుకున్న పార్టీలు సమస్యలను గాలికొదిలి యిలా నరుక్కోవడం ఎందుకో అర్థంకాదు. ఎదురు పార్టీ వారిని చంపినంత మాత్రాన సమస్యలు పరిష్కారంకావు గద. ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో నాకర్థం కావడంలేదు. నిజమే సమస్యలు పరిష్కారంకోసం అభ్యర్థనలు, వినతిపత్రాలు, ధర్నాలు, నిరసనలు, దీక్షలు, ఆమరణ దీక్షలు చేయడం గతంలో చూశాం. అవన్నీ వదిలేసి ఇలా సాటిమనిషిని

చంపడం సరికొత్త రాజకీయాలు ఇప్పుడు చూస్తున్నాం. అవును నాకర్థం కాక అడుగుతాను. నాయకుల్ని చంపితే పార్టీ మనుగడ లేకుండా పోదుగద. ఒక నాయకుని చంపితే వందమంది నాయకులు తయారవుతారని గతంలో ఆంగ్లేయుల పాలనలో కమ్యూనిస్టులను చంపినప్పుడు ఆ నాయకులు అనేవారు. ఎందుకంటే నాయకుల్ని చంపినా సమస్యలు పరిష్కారం కోసం కొత్త నాయకులు పుట్టుకొస్తారని గత చరిత్ర నిరూపించింది. ఇవన్నీ తెలిసికూడా ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో నాకు అర్థం కావడంలేదు. గతంలో అనేక విప్లవాలలో వేలమంది చనిపోయినా ఉద్యమాలు ఆగలేదు. నిజమే సమస్య పరిష్కారం అయ్యేవరకు ఒకరి తరువాత ఒకరు పోరాట జెండా పట్టుకొని ఉద్యమిస్తూనే ఉంటారు. నిజమే బావ ఆంగ్లేయుల పాలనలో కమ్యూనిస్టు నాయకులను కాల్చివేసినా ఇప్పటికి ఆ పార్టీలు బతికేఉన్నాయి.ఇప్పటికీ ప్రజాసమస్యల పరిష్కారంకోసం ఉద్యమాలు నడుపుతూనే ఉన్నారు.

అవును బావ చరిత్ర మన కళ్లముందు కనబడుతున్నా అనాలోచితంగా ఇలా ఒకర్ని ఒకరు చంపుకోవడాన్ని అనాగరిక చర్యగా భావించాల్సి ఉంది. రాజకీయ పార్టీ నాయకులు వారి కార్యకర్తలను రాజకీయ పార్టీలు, సమస్యల పరిష్కారం కోసం ఎలా ఉద్యమించాలో నేర్పకుండా గుండాయిజం, రౌడీయిజం నేర్పితే రానున్న రోజుల్ని మనం ఎలా ఊహించుకోవాలో తలచుకుంటే భయంగా ఉందయ్యా. ప్రత్యర్థులపై తప్పుడు కేసులుపెట్టి జైలుపాలు చేయడం ఇంకా భయపడకపోతే చంపడం ద్వారా సమస్యలు పరిష్కారం కావుగద. రాజకీయ పాఠాలకు బదులు ఎలా చంపాలో నేర్పితే భవిష్యత్తును ఊహించుకుంటే భయంగా ఉందయ్యా. ఒక పక్క కేంద్రంలో అధికారంలో ఉండటంకోసం బద్ధశత్రువులను కూడా చంకన చేర్చుకుంటున్నారు. ప్రజలు వద్దని నిరాకరించి ఎన్నుకోనప్పుడు అధికారంకోసం వెంపర్లాడటం చూస్తే అధికారమే పరమార్థంగా రాజకీయాలు తయారవుతున్నాయి. పదేళ్లు పాలించిన తరువాత ప్రజలకు నచ్చక ఎన్నుకోకపోతే బీజేపీ ఇంకా అధికారం నిలుపుకోవడంకోసం పడేపాట్లుచూస్తే ఏవగింపు కలుగుతోంది.

అది సరే అసలు ప్రజల్లో చైతన్యం తేవాల్సిన నాయకులు వాళ్లను ఆలోచించకుండా గుడ్డిగా అనుసరించే విధంగా తయారు చేస్తున్నారు. ఓటర్లుఎవరూ అడగకపోయినా డబ్బులిచ్చి ఓటు వేయమని చివరకు ఓట్లు అమ్ముకునే స్థితికి తెచ్చింది నాయకులే. ఆలోచించకుండా చెప్పిందిచేసే అనుచరులలో ప్రజాసమస్యలు గాలికొదిలి ప్రజల సొమ్ము కాజేసేవిధంగా నాయకులు తయారయ్యారు. వికసిత్ భారత్ అని మోదీ అంటే వికసిత్ ఆంధ్రా అని చంద్రబాబు అంటుంటే రాష్ట్ర ప్రజలు కూడా అలాగే అనాలి. ఏరూపంలో రాష్ట్రం వికసిస్తుందో నిపుణులు చెప్పాలి. ప్రస్తుతమున్న నిధులతో ఏ రంగంలో రాష్ట్రం వికసిస్తుందో నాయకులు చెప్పాలి. ముఖ్యంగా ప్రజలకు ముందుగా చేయవలసిన పనులు అందుకు నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి. దిగిపోయిన ప్రభుత్వ నేతలను నిందించడమాని వారు చేయనిపనులు త్వరితగతిన చేసే పనిలో నిమగ్నం కావడం ముఖ్యం. అది నిజమే బావ గత ప్రభుత్వం ప్రజావసరాలు తీర్చలేదనేవారిని దించిన ప్రజలను ఈ ప్రభుత్వం వారు చేయలేదని చెప్పవలసిన అవసరంలేదు. వారు చేయనిపనులు చేసి ప్రజల మన్ననలు పొందాలి. అప్పుడే పనిచేయని గత ప్రభుత్వ నేతలు ఇప్పుడు ప్రజల దగ్గరికి వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. బాబు ప్రభుత్వం ఏర్పడి నెలన్నర అవుతోంది కనుక గత ప్రభుత్వంపై నిందలు, దాడులుమాని కార్యోన్ముఖులు కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సాంస్కృతిక పునర్జీవనంలో చంద్రం ప్రముఖ పాత్ర

చంద్రంగారితో దాదాపు 40 సంవత్సరాలుగా నాకు పరిచయం ఉంది. మేమంతా రాష్ట్ర కమిటీలో ఉన్నప్పటికీ ఒక పెద్దగా మేము ఆయనను గౌరవిస్తూ ఉండేవారం. ఆంధ్రదేశంలో కమ్యూనిస్టుపార్టీకి పునాదిరాయి వేసిన వారిలో వారొకరు. సుందరయ్య, కంభంపాటి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావు మొదలగు వారితో పాటు చంద్రంగారు కూడా రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమానికి పునాది వేశారు. అప్పటి నుంచి వారి జీవితాన్ని కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితం చేశారు. నిస్వార్థంగా, నిరాడంబరంగా వారు సేవచేశారు. కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన తీసుకువచ్చిన ప్రత్యేకతలున్నాయి. అనేక మంది యువకులు, జాతీయోద్యమంలో పాల్గొన్న వారు చాలా మంది మన రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్నారు. వారందరికీ కూడా జాతీయోద్యమం మంచి సంప్రదాయాలున్నందు వల్ల వారు స్వయంగా ఆకలింపు చేసుకుని కమ్యూనిస్టు ఉద్యమంలోకి వాటన్నింటినీ తీసుకునివచ్చారు. తెలంగాణ ప్రాంతం నుంచి కూడా అక్కడ జాతీయోద్యమానికి నాయకత్వం వహించిన వారందరూ కూడా దాదాపు నూటికి తొంభైమంది కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారు. రావి నారాయణరెడ్డి, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, సర్వభట్ల రామనాథం. దేవులపల్లి వెంకటేశ్వరరావు ఇత్యాదులందరూ కూడా జాతీయోద్యమం నుంచి వచ్చిన వారే. వీరందరూ కమ్యూనిస్టు ఉద్యమంలోకి 1940 ప్రాంతంలో వచ్చారు. కానీ, చంద్రంగారు 1934 ప్రాంతంలోనే వచ్చారు.

ఒకానొక సందర్భంలో మన దేశ ప్రయోజనాలు, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ప్రయోజనాలు వీటి రెంటికి మధ్య ఏదో వైరుధ్యం ఉన్నట్టు కనపడిందిగానీ వాస్తవంలో అర్థం చేసుకుంటే వైరుధ్యం లేదు. కానీ ఆ సందర్భాలలో కమ్యూనిస్టు ఉద్యమం శైశవ దశలో ఉన్నప్పుడు ఆ రెండింటికి వైరుధ్యం లేనటువంటి విషయం సిద్ధాంత రూపంలో ఒప్పుకోవడం జరిగింది గానీ, ఆ చరణలో దానిని అన్వయించుకోవడంలో అనేక ఒడిదుడుకులు వచ్చాయి. సోవియట్‌పై నాజీ దాడి జరిగినప్పుడు నాజీ సైన్యాలు చాలా ఉధృతంగా, అనుకోని విధంగా మాస్కో వైపు పరిగెత్తుకుంటూ వస్తూ వుంటే అంటే దాదాపు ఒక నెలలోనే మాస్కో దగ్గరకు వచ్చేసినప్పుడు అసలు సోవియట్ యూనియన్ ఉంటుందా? పోతుందా? అని అనిపించినప్పుడు ఆ సందర్భంలో కాంగ్రెస్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ వంటి ప్రముఖులు కాంగ్రెస్ ఉద్యమంలో అంతర్జాతీయతను తర్వాత ప్రజాస్వామ్య సంప్రదాయాలను, ఫాసిస్టు వ్యతిరేక సంప్రదాయాలను నెలకొలిపినటువంటి వారు చాలా మంది బాధపడ్డారు. కాని కొంత మంది కాంగ్రెస్ నాయకులు మాత్రం చాలా ఉల్లాసంగా సోవియట్ యూనియన్ పోతోందంటే ఏదో మంచి జరుగుతుందనే అనుకున్నారు. ఆ నాడు యువకులుగా ఉన్న మేము అందుకు ఆగ్రహం చెందిన మాట వాస్తవం.

సోవియట్ యూనియన్‌ను కాపాడాలి, మరో వైపు దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలి. ఈ రెండింటిని సమన్వయం చేసుకుకోవడం కష్టమైంది. ఆ సమయంలో దీనిని సమన్వయం చేయడానికి చంద్రంగారు చాలా తోడ్పడ్డారు. మొత్తం మీద ఆంధ్రా యూనిట్‌లోని మేమందరం చంద్రంగారు చేసిన సమన్వయానికి ఒప్పుకున్నాం. సోవియట్ యూనియన్ జీవన్మరణ పోరాటంలో ఉన్నప్పుడు మాకు జాతీయవాదులు వ్యతిరేకంగా ఉన్నప్పుడు ఏమి చేయాలా అన్న సమస్య మాకు ఎదురైంది. కాట్రగడ్డ మధుసూదనరావు వంటి పెద్దలు కొందరు మాకు సలహాలు చెప్పేవారు. ఇటువంటి వారు చేసేది తప్పేగానీ వారిని పంచమాంగ దళం అని అనకూడదని వారు చెపుతుండేవారు. వారితో మేము ఒప్పుకున్నాం. వారు పొరబడిన దేశభక్తులు అంతే. అప్పుడు చంద్రంగారి నాయకత్వాన మేము ఆ విధంగానే నిర్ణయానికి వచ్చాం. కానీ, కేంద్రం నుంచి వ్యాసాలు మాకు వేరే విధంగా వచ్చాయి. సుభాష్ చంద్రబోస్ ఏజంట్ అనీ, జయప్రకాశ్ నారాయణపైన కూడా అదేవిధమైన వ్యాసం వచ్చింది. చంద్రంగారి సలహా ప్రకారం, ఆయన నాయకత్వం క్రింద ఈ వ్యాసాన్ని ఆ నాటి పార్టీ పత్రిక ప్రజాశక్తిలో ప్రచురించడానికి మేము నిరాకరించాం. అప్పుడు మమ్మల్నందరినీ కేంద్రానికి పిలిచారు. నేను, చంద్రంగారు, బసవపున్నయ్య, కడియాల గోపాలరావు బొంబయి వెళ్లాం. తీరా మేమక్కడికి వెళ్లే సరికి హిందూ, ముస్లిం మతకలహాలు జరుగుతున్నాయి. అప్పుడు మాకు ఒక్క క్షణం కూడా ఉండబుద్ధి పుట్టలేదు. మా కళ్ల ఎదుటనే హత్యాకాండ జరుగుతుంటే ఏమి చేయలేని పరిస్థితిలో ఇక్కడ ఉండడం అనవసరం, మన ప్రాంతానికి వెళ్లిపోదాం అనుకున్నాం. పార్టీ కేంద్రం వారు చివరకు మాకు నిర్ణయం యిచ్చారు. దాని ప్రకారం ఒక వ్యాసం తరువాత మరొక వ్యాసం కేంద్రం వారు పంపిన విధంగా ప్రచురించం. ముందు బోసు మీద వ్యాసం వేశాం, తరువాత జయప్రకాశ్ నారాయణ మీద అనంతరం రంగా మీద వేశాం. దానితో విజయవాడ వీధులు రణరంగంగా మారాయి. దానితో వలంటీర్లను పెట్టుకుని మీటింగ్‌లు నిర్వహించాల్సిన పరిస్థితులు వచ్చాయి. నాకు ఇటువంటి వాటిలో అప్పుడు పెద్ద అనుభవంలేదు. కానీ, చంద్రంగారి నాయకత్వం క్రింద బోసు తదితరులను అలా అనడం పొరపాటని భావించాం. కానీ, మాకు అనాడు అంత తాహతులేదు. ఆ నాడు బొంబయి నుంచి మేము బయలుదేరే సమయానికి హిందూ ముస్లింల కలహాలలో ఏ క్షణంలో ఎవరు పొడుస్తారా అన్న పరిస్థితి, నలుగురు నాలుగు పక్కల నుంచి స్టేషన్‌కు వచ్చాం. స్టేషన్ ఫ్లాట్‌ఫారం మీద కూడా ముస్లింలను పొడుస్తున్నారు. ఎందుకంటే అక్కడ ముస్లింలకు బలంలేదు. మేము పంచలు కట్టుకున్నాం కనుక మమ్మల్ని ఎవరూ ఏమి అనలేదు.

చంద్రంగారి ఆదర్శ గుణగణాలు

చంద్రంగారి గుణగణాల గురించి తెలసిన వారు చాలా మంది ఉన్నారు. ఆయన గురించిన స్మృతులు కూడా ఉన్నాయి. నేను కొన్నింటినే ప్రస్తావిస్తున్నాను. ఇంకా చాలా ఉన్నాయి. లెనిన్ జీవితంలో ఏ గొప్ప గుణగణాలున్నాయని మనం చదువుకున్నామో చంద్రంగారిలో అలాంటి గుణగణాలన్నింటిని మేము చూడగలిగాం. ఇంత పెద్ద జీవితంలో ప్రతి వ్యక్తి ఏవో కొన్ని పొరపాట్లు చేస్తూనే ఉంటారు. ఏ పొరపాట్లు చేయరని నేను అనుకోను. చంద్రంగారు చనిపోయిన తరువాత, మరోసారి ఆయనతో నాకు గల 40 ఏళ్ల సహచర జీవితాన్ని ఒకసారి పరిశీలించి చూసినప్పుడు నాకు ఏమీ దొరకలేదు. మానవునికి అనేక ఆపేక్షలుంటాయి. ఆ విధంగా ఉండడం తప్పుకాదు, వాటిని సాధించడానికి తప్పుడు పద్ధతులు అవలంబిస్తే అది తప్పు. ఈ 40 ఏళ్ల సహచర్య జీవితంలో ఆయనలో ఎటువంటి స్వార్థంగానీ లేదా ఉద్యోగ ఆపేక్ష వంటివి నాకు ఏకోశాన కనపడలేదు.

మా నలుగురిలో అంటే సుందరయ్యగారు, నేను, చంద్రంగారు, బసవపున్నయ్య గార్లలో ఎవరు ఎక్కడికి వెళ్లాలి, ఏ బాధ్యతలు వహించాలన్నప్పుడు సుందరయ్యగారు, బసవపున్నయ్య గార్లను పార్లమెంట్‌లోనూ, నన్ను శాసనమండలిలోనూ ఉండమన్నారు. చంద్రంగారు రాజ్యసభకు వెళ్లాలన్న ప్రతిపాదన వచ్చింది. కానీ, చంద్రంగారు నేను ఎందుకయ్యా దాంట్లో కేఎల్ నరసింహారావును పంపితే ఉపయోగపడుతుందన్నారు. ఆ ప్రకారంగానే కేఎల్ నరసింహంగారు అప్పుడు రాజ్యసభకు వెళ్లారు. అది రైల్వే పనివార్ల ఉద్యమానికి ఉపయోగపడింది. అలా మొదటి నుంచి పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంస్థలలో పదవులకు, అట్టి వ్యామోహానికి దూరంగా ఉంటూ వచ్చారు. ఇట్టి వ్యామోహం నేడు కమ్యూనిస్టు ఉద్యమంలో లేకపోయింది.

పార్టీ ఐక్యత కోసం చంద్రంగారి కృషి

ఇక శిక్షణ విషయంలో ఆయనకు ఆయనే అందెవేసిన చెయ్యి. ఏ ఒక్క సమయంలో కూడా ఆయన పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించలేదు. పార్టీ ఐక్యతను కాపాడడం కోసం చంద్రంగారు చాలా కృషి చేశారు. రాష్ట్ర కమిటీలో తీవ్ర అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు చంద్రంగారు ఏదో విధంగా సర్ది ఆయన అభిప్రాయాలను కూడా పక్కనపెట్టుకుని రాష్ట్ర కమిటీని ఐక్యంగా ఉంచడానికి కృషి చేశారు. ఆ రోజులలో జైళ్లలో కూడా అభిప్రాయభేదాలు వచ్చాయి. నాలుగు గోడల మధ్య ఒకరినొకరు చూసుకునే పరిస్థితి లేనప్పుడు -అది కడలూరు జైలు అనుకుంటా- అప్పుడు ఆ జైలులో ఉన్న చంద్రంగారు చాలా ఐక్యంగా నిర్వహించారు.

సామాన్య పార్టీ సభ్యునిగా చంద్రంగారి జీవితం

నాయకుడు అన్న వాడు సామాన్య పార్టీ సభ్యునిగా ఉండడం చాలా కష్టసాధ్యమైన విషయం, కానీ చంద్రంగారు మాత్రం అది సాధ్యమని ఆచరణలో రుజువు చేశారు. ఎందుకంటే నాయకునిగా ఉన్న వాడిని తొలగించినప్పుడు అనేక అవలక్షణాలు ప్రదర్శించిన వారున్నారు. అసలు ఇటువంటి వారు నాయకత్వంలో ఇన్నాళ్లు ఎలా ఉన్నారా అని అనిపించేటట్లు ప్రవర్తించిన వారు ఉన్నారు. కానీ పార్టీలో ముఠా తత్వం వచ్చిన తరువాత చంద్రంగారు ఒక నిశ్చయానికి వచ్చారు. ఇక తాను పార్టీని ఐక్యంగా ఉంచలేను, ముఠా తత్వంలో పాల్గొనలేనని రాష్ట్ర కార్యవర్గం, కౌన్సిల్‌లో చెప్పారు. అప్పుడు తన భార్య పేరు మీద ఉన్న కొద్ది పాటి భూమిని అమ్మి (తన పేరమీద ఉన్న భూమిని ఎప్పుడో పార్టీకి ఇచ్చి వేశారనుకోండి) కర్నూలు జిల్లా వెళ్లి అక్కడ కొంత భూమి కొని సాగుచేసి, స్వయంగా దున్ని ఆ విధంగా వ్యవసాయం చేసుకుంటూ అక్కడ చిన్న పార్టీ యూనిట్‌ని నిర్మించారు. అందులో సామాన్య పార్టీ సభ్యులుగా ఉంటూ క్రమశిక్షణాయుతంగా తన జీవితాన్ని గడిపారు. ఇది మనందరికీ శిరోధార్యం.

(1974 ఆగస్టు 22వ తేదీన విశాలాంధ్ర కార్యాలయంలో జరిగిన మద్దుకూరి చంద్రంగారి సంస్మరణ సభలో నాటి సీపీఐ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు గారు చేసిన ప్రసంగం సంక్షిప్త పాఠం)

సత్యాగ్రహి సుమిత్రమ్మ- స్త్రీల హక్కులు

ఏప్రిల్ నెల వచ్చింది. ఎండలు ముదిరి గాడ్పులు సాగించాయి. ఓనాడు సాయంకాలం బయలుదేరి చాలా రోజుల నాడు చూచిన చెల్లెలు మంగమ్మను చూడటానికి వాళ్ల ఊరు వెళ్లాను. ఈ సోదరి తన స్వతంత్ర అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించుతుంది గాన ఆమె ఎడల నాకు గౌరవం మెండు. ఆ రాత్రి ఉక్కగా నుంటచే ఆరుబయటనే పరున్నాము. లోకాభిరామాయణం కబుర్లు కొంతసేపు జరిగిన తరువాత నిద్దురపోయాను. "సునిశితమతి వైశుభాంగ మేలుకో" అనే పాట హెచ్చు స్థాయిలో ఎవరో పాడుతున్నారు. నాకు మెలకువ వచ్చింది. బయటకు పోయి చూశాను. దేశ సేవికలు పాడుకుంటూ బజారునే వెళ్లుచున్నారు. ఆ ఊరి వాళ్లు చాలామంది మేల్కొని వారిని చూడటానికి బయటకు వచ్చారు. దేశ సేవికల వెంటనే ఇద్దరు పోలీసులున్నారు మఫ్టీలో. గుడివాడలో పికెటింగు చేస్తున్న వారిని, పోలీసులు మోటారు లారీలో ఎక్కించి ముదినేపల్లి వైపు దింపినారట. అక్కడ నుంచి వారు నడిచిపోతున్నారు. అక్కడ జేరిన వారితో నేను అన్నాను; స్వతంత్రాభిలాష ఎంత ఉత్సాహాన్నీ, శక్తినైనా ఇస్తుంది. పాపం! ఎన్నడూ నడిచి యెరుగని వారు అర్ధరాత్రి వేళ ఎంతో దూరం ప్రయాణం చేస్తున్నారు, ఆశ్చర్యం గదా! ఒక కాంగ్రెసు అభిమాని అన్నాడు:- నిజంగా సత్యాగహోద్యమం ప్రజలలో నూతనోత్తేజాన్ని కలుగజేస్తోంది. స్త్రీలు కూడా మండిపోయే వేసవికాలంలో పికెటింగు చేయటం, లాఠీ దెబ్బలు తింటూ కూడా యువకులు ముందుకు రావటం నూతన శక్తిని సూచిస్తున్నాయి. ఒక సనాతనుడన్నాడు:- అఘోరించినట్టులే ఉంది లెద్దురూ! ఏమిటబ్బా వచ్చింది! దెబ్బలు తింటేనూ, కావాలని జైలుకు పోతేనూ మాత్రమే వస్తుందేమిటి స్వరాజ్యం, ప్రభుత్వం వేళ్లు పాతుకుని ఉంటేనూ. పైగానేమో! స్త్రీలను కూడా బజారులకెక్కించారు. కాంగ్రెసు అభిమాని:- ఆనకట్టకు పూర్వం కబుర్లు చెబితే యెలాగండి. స్వరాజ్యం కోసం అందరూ పోరాడాలిసిందే. ప్రజల్లో సగంమంది బానిసతనంలో ఉంచిన మనం స్వాతంత్ర్యానికి అర్హులమెలా అవుతాం?

చెల్లెలు మంగమ్మ:- ఏమో! ఇది స్త్రీలు పొందిన స్వాతంత్ర్యానికి చిహ్నమని నేను నమ్మను. పురుషుల ఆజ్ఞల్లో ఒక భాగంగానే, నేనెంచుతాను, వారి కోర్కెలు నెరవేర్చడానికే స్వరాజ్యం కోసమని యేర్పరచి కార్యక్రమంలో యీ దేశ సేవికలు పాల్గొంటున్నారు.

నేను:- అల్లా అని నీవు మాపై చాలా అన్యాయంగా ఆరోపణలు చేస్తున్నావు. మా కాంగ్రెసు వాళ్లు నిజంగా స్త్రీ స్వాతంత్ర్యాన్ని ఆమోదిస్తారు. వారి ఉద్యమాలకు తోడ్పడతారు.

చెల్లెలు మంగమ్మ:- 'కబుర్లు కేమిలే! ఇప్పుడు ఉద్యమంలోకి వచ్చిన సోదరీమణులను, ఎంతమందిని తరువాత రాచకీయోద్యమాల్లో పనిచేయడానికి అవకాశమిస్తారో! చూస్తాంగా! అప్పుడు వీరిని యింతగా కొనియాడే మీరు స్త్రీల హక్కు సత్వాల కోసం పోరాడే వారికి ఎంత సాయం చేస్తారో చూస్తానుగా' అంది.

సోదరి సుమిత్రమ్మ ఆ దేశ సేవికలందరికి నాయకురాలు. వితంతువు. ఆ దళంలో అందరికంటే ధైర్యవంతురాలు. పోలీసులు పిచకారీలతో మసిలేనీళ్లు పూపిరి తిరుగుకుండా ముఖముపై కొట్టినపుడూ ఆమె భీతినొందలేదు. ఆమె అచంచలత్వమే తక్కిన సోదరీమణులందరికీ ధైర్యము నొసగి ఉద్యమాన్ని రేకెత్తించింది. సత్యాగ్రహోద్యమంలో తీవ్రంగా పనిచేయని కాంగ్రెసు నాయకులు, వలంటీరులు ఆమెను చూడడానికి సిగ్గుపడేవారు. సూటిపోటు మాటలతో ఆమె యీసడించి వేస్తుందనే భయంతో ఆమె దగ్గరకు వెళ్లటానికే జడిసేవారు. పోలీసులు దేశ సేవికలను సాయంత్ర బస్సుపై ఎక్కించి చాలా దూరాన విడిచి వస్తూంటే వారంతా పాడుకుంటూ ఏ తెల్లవారగట్టకో శిబిరానికి జేరుకునే వారు బస్సులపై యెక్క నిరాకరించితే బలవంతాన ఎక్కించుటకు ఆడ పోలీసులను కూడా నియమించారు. ఒక్కొక్కపుడు వీరిని అరెస్టు చేసి సబ్‌జైలులో 2 రోజులు ఉంచి విడుదల చేసేవారు. ఎలాగైనా యాతనపెట్టి ఉద్యమంలో నుంచి విరమించేటట్లు చేద్దామని పోలీసులు ప్రయత్నిస్తే, వారికే విసుగు పుట్టించేది సుమిత్రమ్మ. పోలీసువారు ఎన్ని ఆటంకాలు కల్పించినా ఆమె చాలా గ్రామాల్లో జాతీయ వారం జయప్రదంగా జరిపించింది. చివరకు విసిగి వేసారి సుమిత్రమ్మను అరెస్టుచేసి సబ్‌జైలులో నుంచారు. ఆమె భారతదేశం నాదేరా! భారతీయుడనేనేరా అని సన్నని గొంతుతో పాడుతుంటే ఆఫీసులో వాళ్లంతా నివ్వెరపోయేవారు. ఒకసారి సర్కిలు ఆఫీసు పని జరుగుటలేదని కోపంతో ఆమె ఉన్న సెల్ (కొట్టు) ఎదుటకివచ్చి "సుమిత్రమ్మా నీవు మగవాడవై పుట్టి లంగోటి కట్టవలసిన దానవు" అన్నాడు. వెంటనే ఆమె అపుడు నీబోటివారు చీరకట్టి గాజులు తొడిగించుకోవాలసి వచ్చేది" అంది. మళ్లా తలయెత్తలా సర్కిలు.

విచారణచేసి సంవత్సరం శిక్షవేసి జైలుకు పంపారు సుమిత్రమ్మను. జైల్లో తాను యెన్నో బాధలుపడి, ఉపవాసాలు చేసి జైలు అధికారులను ఏడ్పించి, శిక్ష పూర్తిగా అనుభవించి బయటికివచ్చింది సుమిత్రమ్మ. అప్పటికపుడే గాంధీగారు శాసనోల్లంఘనాన్ని దిగవిడిచి హరిజన సమస్యను పైకి తెచ్చారు. హరిజనులకు దేవాలయ ప్రవేశ హక్కు కొరకు కాంగ్రెసు వారు ప్రచారం చేస్తున్నారు. సుమిత్రమ్మ తన సహజ పుత్సాహశక్తులతో తన పూళ్లో ప్రచారం సాగించింది. గ్రామంలో ప్రజలు చాలామంది హరిజనుల దేవాలయ ప్రవేశానికి సుముఖులయ్యారు. కాని ధర్మకర్తలు ఒప్పుకోలేదు. అంతట ఆమె ప్రజలందరి వద్దనుంచి సమ్మతులు తీసికొంది. నూటికి ఎనుబదిమంది దేవాలయ ప్రవేశానికి అనుకూలురే. కాని, లాభం! ధర్మకర్తలు ప్రజాభిప్రాయాన్ని లెక్కచేయనపుడు. అయితే సుమిత్రమ్మ స్వభావంలో ఏపనిని సగంలో విడుచుట కానిపని. దేవాలయం ముందు ఉపవాసాలు చేయడం మొదలుపెట్టింది. హరిజనులు దేవాలయంలో ప్రవేశించందే ఆహారం ముట్టనని ప్రతినచేసింది. పదిహేను రోజులుపవాసం జరిగింది. ఒకసారి స్మారకం తప్పింది. ప్రజలంతా ధర్మకర్తలను దూషించారు. వారు ప్రజాభిప్రాయానికి భయపడి అనుమతించారు. ఈసారి జయం సుమిత్రమ్మదే. ఉపవాసం మానివేసిందామె.

సుమిత్రమ్మ దేశ స్వాతంత్ర్యం కొరకు పోరాటంలో పాల్గొని ఖ్యాతి పొందింది. తోటి దేశీయుల చేతనే అణచివేయబడిన హరిజనుల హక్కుల కొరకు పోరాడి దూషణాభూషణా కూడా పొందింది. కాని ఇకనో?.....సుమిత్రమ్మకు భర్త వారసులు మనోవర్తి యిస్తూ ఉండేవారు. కాని మనోవర్తి పుచ్చుకోడం హీనంగా కనబడిందామెకు. తన భర్తకు ఆస్తిని న్యాయంగా తానే అనుభవించాలి. ఇట్లాగే అనేకమంది స్త్రీలు తమకు ధర్మంగా చెందాలసిన ఆస్తిని వారసులనుభవించగా, మనోవర్తితో జీవితాన్ని గడపటం దుర్భరంగా తోచిందామెకు. వారసుడైన మరిదితో తన భర్త భాగం తనకివ్వాలని పోరాడింది. పొలంలో కోతకు అడ్డము తగిలింది. కాని ఆమె లేని సమయంజూచి, కోతకోసి కుప్పవేశారు. సుమిత్రమ్మ కుప్పలో తనకు భాగం ఉందని పేచీపెట్టింది. కాని ఆమెకు ఎవరూ సాయంచేయలేదు. పైగా యిది వరకు భూషించినవారే దూషించమొదలెట్టారు జాయింటు కుటుంబంలో భర్త చనిపోయిన తరువాత విధవకు ఆస్తిపై హక్కేమిటన్నారు. 'లా' లేదు గాన సుమిత్రమ్మ పోరాడటం 'తెలివి తక్కువ' 'పిచ్చ' అన్నారు. కాని ఆమె 'శాసనాలతో లెఖ్ఖ ఏమిటి? ధర్మాన్ని సాధించాలి; అనుకొంది. చాటుగా కుప్ప కొట్టుకుపోవాలని మరిది ప్రయత్నాలు తెలుసుకొంది. ఏ విధంగానైనా ధాన్యం అతనికి చెందకుండా చెయ్యాలనుకుంది. ఆ ధాన్యపు కుప్పకు నిప్పంటించి భస్మం చేసింది.

తా చేసినపని సుమిత్రమ్మ నిర్భయంగా ప్రజలందరికీ చెప్పింది. కొందరామెకు పిచ్చెక్కిందన్నారు. కొందరు మదించి అలాంటి పనులు చేస్తోందన్నారు. రిపోర్టు ననుసరించి పోలీసులు అరెస్టుచేసి సబ్‌జైలులో పెట్టారు. ప్రజలంతా సుమిత్రమ్మను కుప్ప తగులబెట్టి జైల్లో పడిందని విపరీతంగా చెప్పుకుంటున్నారు. మిత్రులు రాజీపడి కేసు ఎత్తివేయునటుల చేదామని ప్రయత్నం చేశారు. న్యాయాధికారి 'తానేమీ ఎరుగనని' చెప్పితే, కేసు కొట్టివేస్తానన్నాడు. కాని వీనిలో దేనికీ సుమిత్రమ్మ ఒప్పుకోలా. 'తన భర్త ఆస్తిని స్త్రీ అనుభవించడం ధర్మం కాదా! అందులకు విరుద్ధంగా కలిగే ఆటంకాలను ఆమె యెదుర్కోవడంలో తప్పేముంది. అందుకొరకు జైలుకు పోతే మాత్రం తప్పేమి', అని ఆమె వాదన.

అనుమతి పొంది నేనూ, సోదరి మంగమ్మ సుమిత్రమ్మను చూడడానికి సబ్ జైలుకు పోయాము. నేను సుమిత్రమ్మతో అన్నాను. 'మీరిలా చేయడం బాగుండలేదు. స్త్రీలకు ఆస్తి హక్కులు సంపాదించాలంటే, బలమైన ప్రచారం స్త్రీల మధ్య చెయ్యాలి. స్త్రీ జనమంతా ఉద్యమంలో పాల్గొని పోరాడేటట్లు చెయ్యాలి.

సుమిత్రమ్మ:- సాగని మాటలు చెప్పవద్దు. స్త్రీలంతా పురుషుల ఆధీనంలో ఉన్న బానిసలు ప్రచారకుల మాటలు వారి చెవుల్లో దూరవు. అసలు పురుషులు మాబోంట్లను వారి దగ్గరకే పోనివ్వరు. కాన వారి హృదయాల్లో ఆవేశం పుట్టించి, పులకాంకితులచేసి, వారి స్థితిని ఆలోచించుకొనేటట్లు చేసే, ఉత్తేజకరమైన పనులు చెయ్యాలిసిందే.

నేను:- లాభమేముంది, వృథా కష్టమేగాని. ప్రచారంద్వారా శక్తులన్నింటిని సంఘటితం చేసుకోవాలి. ఆందోళన చేసి శాసనం మార్పించాలి.

సోదరి మంగమ్మ:- అన్నయ్యా! నీవు కూడా పాలకుల దృక్పథంతోనే చూస్తున్నావు. అధికారం చెలాయించేవారు శాసనాలను, తమ అధికారాన్ని నిలబెట్టుకోడానికే చేస్తారు. వాటి నుంచి కష్టనష్టాలు పడేవారు ఎపుడూ ప్రార్థనలవలన, శాసనాలను తమ కనుకూలంగా మార్పించుకోజాలరు. అందువల్లనే విప్లవాలు తప్పనిసరి అవుతాయి.

ఏదో నేను సుమిత్రమ్మను లొంగదీస్తానని మాట్లాడనిస్తున్న ఇన్‌స్పెక్టరు సోదరి మాటలతో కరకు మీరి "టైము అయిపోయింది. ఇక చాలించండ" న్నాడు.

విచారణ జరిగింది. నిప్పంటించి ఆస్తికి నష్టము కలిగించిందని కఠినశిక్ష విధించారు. సుమిత్రమ్మను రాయవెల్లు వెంటనే పంపించారు.

ఇపుడు సుమిత్రమ్మ పేరు తలచేవారే లేరు. ఇప్పటికీ సోదరి మంగమ్మ నన్ను దెప్పుతూనే ఉంటుంది. "స్త్రీలను సత్యాగ్రహోద్యమంలోనికి రానివ్వడం, పురుషులు కోరి ఆజ్ఞాపించి చేయించే అన్ని పనులవంటిదే గాని, స్వతంత్ర చిహ్నంకాదు! కాంగ్రెసువారు నిజంగా స్త్రీ స్వాతంత్ర్యాన్ని అభిలషించితే, సత్యాగ్రహి సుమిత్రమ్మను కీర్తించి ఆకాశాన కెత్తినవారు, స్త్రీల ఆస్తిహక్కులకై పోరాడి జైలుకువెళ్లిన సుమిత్రమ్మ గురించి యోజింపనైనా యోచింపరేం! ప్రజలకేదో మేలు చేస్తామని అసెంబ్లీకి వెళ్లిన కాంగ్రెసువారు, డైవోర్సుశాసనం, స్త్రీలకు ఆస్తిపై హక్కునిచ్చే శాసనంగావించడానికి ప్రయత్నించరేం అని.

(చిత్రగుప్తలో మద్దుకూరి చంద్రంగారు రాసిన కథ)

మహారాష్ట్ర అతలాకుతలం

- ముంబై సహా వివిధ జిల్లాల్లో భారీవర్షాలు, వరదలు
- జనజీవనం అస్తవ్యస్తం
- పూణెలో కరెంట్ షాక్‌తో ముగ్గురి మృతి
- మనాలీలో కుంభవృష్టి

ముంబై: భారీ వర్షాలు మహారాష్ట్ర అతలాకుతలం చేస్తున్నాయి. రాజధాని నగరం ముంబై సహా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో గురువారం కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో జనజీవనం స్తంభించింది. మరోవైపు హిమాచల్‌లోని పర్యాటక ప్రదేశం మనాలీ సమీపంలోని పాల్చన్‌ను కుంభవృష్టి ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దేశ ఆర్థిక రాజధాని ముంబై తడిసి ముద్దయింది. అనేక ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అత్యవసరం అయితేనే ఇళ్లు, లేదా ఆఫీస్ ల నుంచి బయటకు రావాలని బీఎంసీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ముంబై లోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈనేపథ్యంలో విమానయాన సంస్థలు ప్రయాణికులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశాయి. వర్షం కారణంగా విమాన సమయాల్లో జాప్యానికి కారణమవుతోందని, విమానాశ్రయాలకు బయల్దేరేముందు ఫ్లైట్ స్టేటస్ తనిఖీ చేసుకోవాలని ఇండిగో సంస్థ సూచించింది. స్పైస్‌జెట్ నుంచి కూడా ఇదేతరహా ప్రకటన వచ్చింది. కాగా నగరానికి నీటిని సరఫరా చేసే ఏడు సరస్సుల్లో రెండు ఉప్పొంగుతున్నాయి. సాయన్, చెంబూర్, అంధేరీ ప్రాంతాలపై ప్రభావం తీవ్రంగా ఉంది. అంధేరీ సబ్‌వే ద్వారా రాకపోకలను నిలిపివేశారు. శుక్రవారం ఉదయం వరకు ముంబైకి రెడ్ అలర్ట్ జారీ అయింది. పూణేలోని పింప్రి చించ్‌వాడ్‌లోని అనేక నివాస అపార్ట్‌మెంట్లు జలమయమయ్యాయి. ఏక్తా నగర్ వంటి వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు అగ్నిమాపక శాఖ పడవలను ఉపయోగిస్తోంది. కొన్ని చోట్ల నడుము మట్టం వరకు నీరు చేరుకుంది. ఈ క్రమంలో పలు చోట్ల రైళ్లను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

ఇక పూణెలోనే భారీ వర్షాల కారణంగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో గురువారం తెల్లవారుజామున భారీ వర్షాల కారణంగా నీట మునిగిన హ్యాండ్‌కార్ట్‌ను తరలించే ప్రయత్నంలో ముగ్గురు వ్యక్తులు విద్యుదాఘాతంతో మరణించారని పోలీసులు తెలిపారు. డెక్కన్ జింఖానా ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు వారు తెలిపారు. ఖడక్‌వాస్లా డ్యామ్ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా గురువారం డ్యామ్ పూర్తి స్థాయికి చేరుకుంది. కురుస్తున్న వర్షాల కారణంగా నీటి మట్టం పెరగడంతో ముఠా నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. ఈ క్రమంలో పూణె జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాలను 48 గంటల పాటు మూసివేయాలని లెక్టర్ సుహాస్ దివాసే ఆదేశించారు. మునిగిపోయే ప్రమాదం ఉన్న వంతెనలపై ట్రాఫిక్‌ను నిషేధిస్తామని ఆయన వెల్లడించారు. ఖడక్ వాస్ల డ్యామ్‌లో భారీ నీరు వచ్చి చేరుతోంది. దీంతో దిగువకు 35,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు దివాసే వెల్లడించారు.

వీలైనంత త్వరగా సహాయం: అజిత్ పవార్

మహారాష్ట్రలోని వివిధ జిల్లాల్లో, ముఖ్యంగా ముంబై, పూణె, థానే, కొల్హాపూర్, సాంగ్లీలో కొనసాగుతున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిని ఈ రోజు తెల్లవారుజాము నుంచి తన కార్యాలయం నుంచి సమీక్షిస్తున్నానని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తెలిపారు. సహాయక చర్యల్లో జాప్యం లేకుండా ప్రజలకు అవసరమైన సహాయాన్ని వీలైనంత త్వరగా అందించాలని అన్ని జిల్లాల విపత్తు నిర్వహణ వ్యవస్థ, సంబంధిత జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలిపారు. మహారాష్ట్ర ప్రజలు అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని, ప్రయాణాలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

మనాలీలో మెరుపు వరదలు

దేశ పర్యటక ప్రదేశమైన మనాలీ సమీపంలోని పాల్చన్‌ను గురువారం కుంభవృష్టి ముంచెత్తింది. దీంతో ఆక్కడి వాతావరణం ప్రమాదకరంగా మారింది. అదే ప్రాంతంలో ఉన్న అంజనీ మహాదేవ్ కాలువ ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. మనాలీకి 15 కి.మీ. దూరంలో మెరుపు వరదలు ఆ ప్రాంతాన్ని ముంచెత్తాయి. అర్ధరాత్రి 1గంట సమయంలో అంజనీ మహాదేవ్ కాలువ నుంచి తీవ్రమైన శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కిపడి లేచారు. వీరి నివాసాలు కాలువ ఒడ్డునే ఉన్నాయి. వరదలతో అప్రమత్తమైన స్థానికులు మెరుపు వరదను గమనించి ఎత్తయిన ప్రదేశాలకు వెళ్లిపోయి ప్రాణాలు కాపాడుకున్నట్లు పాల్చన్ పంచాయతీ సభ్యురాలు రమాదేవీ వెల్లడించారు. కాగా, మనాలీ- లేహ్ జాతీయ రహదారిపై ఉన్న వంతెన మీదకు కాలువలోని భారీ బండరాళ్లు కొట్టుకొచ్చాయి. దీంతో ఈ మార్గాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఇది కీలకమైన లద్దాఖ్‌ను, దేశంలోని మిగిలిన ప్రదేశాలతో కలిపే మార్గం. వర్షం కారణంగా ఇక్కడి నాలాలో కూడా భారీగా వరద నీరు చేరింది. ఈ వరదలకు పల్చన్, రూడా, కులాంగ్ గ్రామాలు తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. ఇప్పటివరకు రెండు ఇళ్లు కొట్టుకుపోయాయని సమాచారం. ఈ వరదల్లో ప్రాణనష్టం గురించి ఇంకా తెలియాల్సి ఉంది. ఇక రోహ్‌తంగ్ పాస్ నుంచి లాహౌల్ వరకు భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. భారీ వర్షాలు శుక్రవారం కూడా కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఉష్ణోగ్రత కూడా 15 డిగ్రీల సెల్సియస్ ఉంటుందని అంచనా వేశారు.

తుంగభద్రకు పెరిగిన వరద

10 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

కంప్లి(బెంగళూరు): తుంగభద్ర జలాశయానికి వరద పెరుగుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగ, భద్ర నదులు ఉప్పొంగి తుంగభద్ర డ్యాంకు వరద ఉధృతి పెరుగుతోంది. బుధవారం సాయంత్రం 10 గేట్లు ఎత్తి దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి 18,686 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వరద తీవ్రతను బట్టి నదికి క్రమక్రమంగా నీటి విడుదలను పెంచుతామని బోర్డు అధికారులు తెలిపారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1627.21 అడుగుల వద్ద 98.961 టీఎంసీలు డ్యాంలో నీటిని నిల్వ చేశారు. 87,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇప్పటికే హంపి, కంప్లి భాగాల్లో పూర్తి స్థాయిలో నీరు ప్రవహిస్తోంది. నీటి ఉధృతి పెరగడంతో మత్స్యకారులు నది ఒడ్డునే ఉండిపోయారు. ఇప్పటికే కంప్లి కోటే, సన్నాపురం, బెళుగోడుహాళ్, ఇటిగి సన్నాపురం గ్రామాల్లో అధికారులు ముందస్తు హెచ్చరికలు చేశారు. నది ఒడ్డున ఉండే గ్రామప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని గేట్ల ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మమత దిల్లీ పర్యటన వాయిదా

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ... దిల్లీ పర్యటన వాయిదా వేసుకున్నారు. ఆమె గురువారం దిల్లీ వెళ్లాల్సి ఉంది. అయితే ఈ నెల 27న నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు దిల్లీ వెళ్లనున్నారు. ఒక రోజు ఆమె తన పర్యటన వాయిదా వేసినట్లు తెలుస్తోంది. నీతి ఆయోగ్ సమావేశాన్ని కాంగ్రెస్ సీఎంలు బహిష్కరించిన నేపథ్యంలో మమతా ఆ నిర్ణయం తీసుకున్నట్లు అంచనా వేస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు కేంద్రం మొండి చేయి చూపినట్లు సీఎంలు ఆరోపించారు. నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ నిర్ణయించారు. కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించినట్లు స్టాలిన్ ఆరోపించారు. కాగా, సీఎం మమతా గురువారం దిల్లీకి వెళ్లడం లేదని, అయితే ఎటువంటి కారణాన్ని ఆమె వెల్లడించలేదని టీఎంసీ నేత ఒకరు వెల్లడించారు. దిల్లీకి శుక్రవారం వెళ్తారా అని అడిగిన ప్రశ్నకు ఆ నేత బదులిస్తూ.. దీనిపై ఏం చెప్పలేమని, రేపు మాత్రమే ఈ అంశంపై క్లారిటీ వస్తుందన్నారు. ఇండియా కూటమి నేతృత్వంలోని ప్రతిపక్షంలో టీఎంసీ కూడా ఉన్న విషయం తెలిసిందే.

అంతరించిపోతున్న జానపద కళలు: కంగన

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ గురువారం పార్లమెంటులో తొలిసారి ప్రసంగించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె... తమ రాష్ట్రంలో గిరిజన సంగీతం, జానపద కళలు అంతరించిపోతున్నాయన్నారు. సభలో మాట్లాడిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. హిందీలో ప్రసంగించిన కంగన... మండి ప్రజల తరపున మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు స్పీకర్‌కు కృతజ్ఞతలు చెప్పారు. 'మండిలో వివిధ కళారూపాలు అంతరించిపోయే దశలో ఉన్నాయి. హిమాచల్‌లో కత్-కుని అనే హస్తకళ ఉంది. గొర్రె చర్మాన్ని జాకెట్లు, టోపీలు, శాలువాలు, స్వెటర్లు వంటి అనేక రకాల దుస్తుల తయారీకి వినియోగిస్తారు. వీటికి విదేశాల్లో ఎంతో విలువ ఉన్నా... ఇక్కడ మాత్రం అంతరించిపోతున్నాయి. అందువల్ల, వీటికి ప్రోత్సాహమిచ్చేలా ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించాల్సిన అవసరం ఉంది. హిమాచల్‌లో జానపద సంగీతం, మరీ ముఖ్యంగా స్పితి, కిన్నౌర్, భర్మౌర్‌లోని గిరిజన సంగీతం, వారి జానపదం, కళారూపాలు అంతరించిపోతున్నాయి' అని కంగన తెలిపారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై మోదీ దృష్టి

ఎన్డీయే ఎంపీలతో మంతనాలు

న్యూదిల్లీ: సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసి రెండు నెలలు కూడా కాకముదే మహారాష్ట్ర అంసెబ్లీ ఎన్నికలపై ప్రధాని నరేంద్రమోదీ దృష్టి కేంద్రీకరించారు. అందులో భాగంగా మహారాష్ట్రకు చెందిన ఎన్డీయే ఎంపీలతో ప్రధాని మోదీ గురువారం న్యూదిల్లీలో సమావేశమయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై వారితో మోదీ చర్చించారు. మరోవైపు ఎన్సీపీ (అజిత్) అధినేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ బుధవారం న్యూదిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. ఆ కొద్ది గంటలకే ఎన్డీయే ఎంపీలతో ప్రధాని సమావేశం కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి 80 నుంచి 90 సీట్లు కేటాయించాలని అమిత్ షాతో భేటీలో అజిత్ డిమాండ్ చేసినట్లు సమాచారం. అంతేకాకుండా సీట్ల సర్దుబాటు విషయంలో ఎన్నికల చివర నిమిషం వరకు కాకుండా ముందే ఓ స్పష్టత ఇవ్వాలని అమిత్ షాకు అజిత్ పవార్ విజ్ఞప్తి చేశారని తెలుస్తోంది. ఈ అంశంపై కూడా ఎన్డీయే ఎంపీలతో మోదీ చర్చించి ఉంటారని భావిస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ చివర నిమిషంలో అజిత్ పవార్ పార్టీకి ఎంపీ సీట్లు కేటాయించింది. ఆ ఎన్నికల్లో ఒకే ఒక్క ఎంపీ స్థానాన్ని అజిత్ పవార్ పార్టీ గెలుచుకుంది. దీంతో సీట్ల పంపకం విషయంలో ముందే స్పష్టత ఉండాలని అమిత్ షాకు ఆయన సూచించినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రంలో బీజేపీ కేవలం 9 స్థానాల్లో విజయం సాధించగా... శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ 8 ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంది. మోదీతో భేటీలో మహారాష్ట్రకు చెందిన కేంద్రమంత్రులు నితీన్ గడ్కరీ, పీయూష్ గోయల్ తదితరులు పాల్గొన్నారు. 288 ఎమ్మెల్యే స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీకి ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరగనున్నాయి.

విమాన టికెట్ ధరల తగ్గింపునకు కృషి

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూదిల్లీ: దేశీయ విమానయాన సంస్థ 'ఎయిర్ విస్తారా'లో టికెట్ ధరలు ఆకస్మికంగా పెరుగుతున్నాయంటూ లోక్‌సభలో కొందరు ఎంపీలు ఫిర్యాదు చేశారు. స్పీకర్ ఓం బిర్లా కూడా దీనిపై ఆందోళన వ్యక్తం చేయడంతో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పందించారు. లోక్‌సభలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో డీఎంకే ఎంపీ దయానిధి మారన్ ఈ సమస్యను లేవనెత్తారు. ఎయిర్ విస్తారాలో చెన్నై నుంచి దిల్లీకి తాను టికెట్ బుక్ చేసుకునేందుకు ధర చూడగా తొలుత రూ.25 వేలు చూపించిందని తెలిపారు. బుకింగ్ ప్రాసెస్ పూర్తయ్యాక పేమెంట్ చేసేటప్పుడు మాత్రం ఆ ధర రెండు నుంచి మూడు రెట్లు పెరుగుతుందని అన్నారు. దీనిపై ఓం బిర్లా స్పందిస్తూ ఇతర ఎంపీల నుంచి కూడా తనకు ఇలాంటి ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని సభాపతి అభిప్రాయపడ్డారు. దీనికి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు బదులిస్తూ ఈ అంశంపై దర్యాప్తు చేపడతామని తెలిపారు. సామాన్యపౌరులకు కూడా విమాన ప్రయాణం అందుబాటు ధరల్లో ఉండేలా చూస్తామన్నారు. 'వినియోగదారుడే దేవుడు. మాకు వారే ప్రథమ ప్రాధాన్యం. చౌక విమానయానం కోసం సాధ్యమైనంత మేర ప్రయత్నాలు చేస్తాం. అంతర్జాతీయ మార్గాల్లోనూ హాలిడే సీజన్లలో టికెట్ ధరలు అధికంగా ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపైనా దర్యాప్తు జరుపుతాం. అయితే, ప్రస్తుత నిబంధనల ప్రకారం విమాన టికెట్ ధరలను ప్రభుత్వం నియంత్రించలేదు. రద్దీ, సెలవులు, విమాన ఇంధన ధర, పోటీ వంటి అంశాలపై ఈ ధరలు ఆధారపడి ఉంటాయి' అని కేంద్రమంత్రి వివరించారు.

విద్యార్థులకు పాఠాలు బోధించిన రాష్ట్రపతి

న్యూదిల్లీ: రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము బాధ్యతలు చేపట్టి నేటికి సరిగ్గా రెండు సంవత్సరాలు. ఉపాధ్యాయురాలిగా బోధించడం తనకెంతో ఇష్టమైన వృత్తి. ప్రెసిడెంట్ ఎస్టేట్‌లోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయ పాఠశాలకు వెళ్లి విద్యార్థులను ఆశ్చర్యపర్చారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. తొలుత విద్యార్థుల పేర్లు అడిగి వారితో ముచ్చటించారు. వారి అభిరుచులు, లక్ష్యాలు తెలుసుకున్నారు. ఈ తరం విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, సాంకేతికంగా వీరికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని ముర్ము అన్నారు. అనంతరం 'గ్లోబల్ వార్మింగ్'పై వారికి బోధించారు. భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. నీటి సంరక్షణ ప్రాముఖ్యాన్ని వివరించారు. పర్యావరణ మార్పు ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ పిలుపునిచ్చిన 'ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి)' గురించి ప్రస్తావించారు. ప్రతీ విద్యార్థి తమ పుట్టిన రోజున ఓ మొక్క నాటాలని ఆకాంక్షించారు. ఒడిశాకు చెందిన ద్రౌపదీ ముర్ము దేశ 15వ రాష్ట్రపతిగా 2022 జులై 25న ప్రమాణస్వీకారం చేశారు. దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించిన తొలి ఆదివాసీ వ్యక్తిగా ఆమె సరికొత్త చరిత్ర సృష్టించారు. అంతేకాదు ఈ పదవిని చేపట్టిన అతి పిన్నవయస్కురాలు కూడా ఈమే కావడం విశేషం. రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆమె ఝార్ఖండ్ గవర్నర్‌గా వ్యవహరించారు. 1994-97 మధ్య రాయ్‌రంగ్‌పూర్‌లోని శ్రీఅరబిందో ఇంటిగ్రెల్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో గౌరవ అసిస్టెంట్ టీచర్‌గా వ్యవహరించారు.

ఓటమిని జీర్ణించుకోలేకే...

కాంగ్రెస్‌పై మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూదిల్లీ: నీట్ (యూజీ) వ్యవహారంపై సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం విద్యార్థుల ఓటమి కాదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. వరుసగా మూడోసారి ఎన్నికల్లో ఓడిపోవడంతో కాంగ్రెస్ బాధ్యతారాహిత్య వైఖరి ప్రదర్శిస్తూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. పేపర్ లీక్‌లు, అవినీతికి కాంగ్రెస్ పార్టీ తండ్రి లాంటిదని ఆరోపిస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. పరీక్షల పవిత్రతకు సంబంధించి ఎలాంటి వ్యవస్థాగతమైన ఉల్లంఘన జరగలేదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. కాంగ్రెస్‌కు కేంద్ర ప్రభుత్వంపై గానీ, సుప్రీంకోర్టుపై గానీ నమ్మకం లేదని మండిపడ్డారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో అక్కడ పేపర్ లీక్ అయిన విషయం ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గేకు తెలియదా అని ప్రధాన్ ప్రశ్నించారు. వారి ప్రభుత్వ హయాంలో లీక్‌లు జరిగితే ఎందుకు మిన్నకుండిపోయారని ప్రశ్నించారు.

పేపర్ లీకేజీల నేపథ్యంలో దేశ ప్రజలు వరుసగా మూడోసారి కూడా కాంగ్రెస్‌ను తిరస్కరించారనీ, అందువల్ల పతనమవుతున్న తన రాజకీయ ప్రాభవాన్ని నిలబెట్టుకొనేందుకే ఇలా అవాస్తవాలు, అర్ధ సత్యాలు, అరాచకానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఖర్గేకు గానీ, రాహుల్‌గాంధీకి గానీ విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన లేదని ఆరోపించారు. దేశ పరీక్ష విధానం, దాని ప్రతిష్టను దిగజార్చి విద్యార్థుల భవితతో ఆడుకోవడం మానుకోవాలని చెప్పుకొచ్చారు.

'కవచ్'పై జవాబు దాటవేసిన రైల్వేమంత్రి

న్యూదిల్లీ: దేశంలో రైళ్ల ప్రమాదాలను నివారించేందుకు తీసుకొచ్చిన 'కవచ్' వ్యవస్థపై ప్రశ్నలకు కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ దాటవేశారు. 2023లో అనేక ప్రమాదాలు జరిగిన క్రమంలో కవచ్ కోసం డిమాండ్ పెరిగింది. కవచ్ ఏర్పాటు కోసం ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటో వెల్లడించేందుకు రైల్వే మంత్రి ఇష్టపడటం లేదు. ఈ ఏడాది రైల్వేకు బడ్జెట్ (రూ.263 లక్షలకోట్లు) కేటాయింపులో నుంచి రూ.1,113 కోట్లను కవచ్ కోసం కేటాయించారు. ఈ భద్రతా వ్యవస్థ సేవలు దేశంలోని రైల్వే నెట్వర్క్‌లలో రెండు శాతానికే పరిమితమయ్యాయి. రైల్వే బడ్జెట్‌పై మాట్లాడేటప్పుడు కవచ్ గురించి వైష్ణవ్ వివరించారు. 1980, 1990 దశకాల్లో యూరప్‌లో కవచ్ తరహా వ్యవస్థలను తీసుకొచ్చారు కానీ భారత్‌లోని ప్రభుత్వాలు దీనిని పట్టించుకోలేదన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై దృష్టి పెట్టారని, కవచ్ వ్యవస్థకు సన్నాహాలు జరిగాయని, ఇప్పుడు దీని సేవలను విస్తరించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. కవచ్ వ్యవస్థ ఏర్పాటు టైమ్‌లైన్ గురించి విలేకరులు ప్రశ్నించగా సమాధానం ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నాన్ని కేంద్ర మంత్రి చేశారు. రాబోయే కొన్ని నెలలు లేక వారాల సమయంలో కవచ్ 4.0 ప్రణాళిక అమల్లోకి వస్తుందని చెప్పారు. అయితే గతంలో యూపీఏ ఇచ్చిన దాని కంటే మోదీ హయాంలో బెంగాల్‌కు రైల్వే బడ్జెట్ పెరిగిందని ఆయనన్నారు.

కలకత్తా హైకోర్టు న్యాయమూర్తుల పదవీ కాలం పొడిగింపు

న్యూదిల్లీ: కలకత్తా హైకోర్టులోని కొంతమంది న్యాయమూర్తుల పదవీ కాలాన్ని పొడగించాలని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. హైకోర్టులో పనిచేస్తున్న తొమ్మిది మంది అదనపు న్యాయమూర్తుల పని వేళలను సైతం ఏడాదిపాటు పొడిగించాలని సిఫార్సు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడిన కొలీజియం... హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలు, పొడిగింపులను నిర్ణయించే బాధ్యత కలిగి ఉంది. ఏప్రిల్‌లో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తులుగా విశ్వరూప్ చౌదరి, పార్థ సారథి సేన్, ప్రసేన్‌జిత్ బిస్వాస్, ఉదయ్ కుమార్, అజయ్ కుమార్ గుప్తా, సుప్రతిమ్ భట్టాచార్య, పార్థ సారథి ఛటర్జీ, అపూర్వ సిన్హా రేలను నియమించాలని కొలీజియం ఏకగ్రీవంగా సిఫార్సు చేసింది. ఏప్రిల్ 29న హైకోర్టు కొలీజియం ఏకగ్రీవంగా తొమ్మిది మంది అదనపు న్యాయమూర్తుల పేర్లను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించేందుకు సిఫారసు చేసిందని తీర్మానంలో పేర్కొంది. ఈ సిఫారసుపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ తమ అభిప్రాయాలు తెలియజేయలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శాశ్వత న్యాయమూర్తులుగా నియమించడానికి అదనపు న్యాయమూర్తుల అనుకూలతను నిర్ధారించడానికి, కలకత్తా హైకోర్టు వ్యవహారాలపై న్యాయమూర్తులను సంప్రదించినట్లు సుప్రీంకోర్టు కొలీజియం తెలిపింది. అన్ని అంశాలను పరిశీలించిన తరువాత కొలీజియం ఆగస్టు 31, 2024 నుంచి వచ్చే ఏడాది అదే సమయం వరకు వీరిని కొనసాగించనుంది.

దర్బార్ హాల్, అశోక్ హాల్‌కు కొత్త పేర్లు

న్యూదిల్లీ: రాష్ట్రపతి భవన్‌లో రెండు హాళ్లకు పేర్లు మార్చారు. వివిధ కార్యక్రమాలకు వేదికగా ఉంటున్న దర్బార్ హాల్, అశోక్ హాల్‌ను ఇకనుంచి గణతంత్ర మండపం, అశోక్ మండపంగా పిలవనున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి సెక్రటేరియట్ వెల్లడించింది. 'జాతీయ అవార్డుల కార్యక్రమం వంటి ప్రధాన వేడుకలను ఈ దర్బార్ హాల్‌లో నిర్వహిస్తుంటాం. ఆంగ్లేయులు, భారత పాలకులు సమావేశాలు నిర్వహించిన ప్రాంతాన్ని దర్బార్ అనేవారు. భారత్ గణతంత్ర రాజ్యంగా మారిన తర్వాత ఆ పదం ప్రాముఖ్యతను కోల్పోయింది. గణతంత్ర భావన భారత సమాజంలో లోతుగా పాతుకుపోయింది. అందుకే ఈ హాల్‌కు గణతంత్ర మండపం సరైంది' అని పేర్కొంది. 'అశోక్ హాల్ ఒక బాల్‌రూమ్. అశోక్ అంటే అన్ని బాధల నుంచి విముక్తుడైన వ్యక్తి అని అర్థం' అని వెల్లడించింది. భారత చరిత్రలో అశోక చక్రవర్తి, సమాజంలో అశోక చెట్టుకున్న ప్రాముఖ్యత దృష్ట్యా దానికి అశోక్ మండపం అని మార్చినట్లు వివరించింది. ఈ పేర్ల మార్పుపై విపక్షాలు విమర్శలు చేశాయి. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ దర్బార్ అనే కాన్సెప్ట్ లేదు. కానీ షెహన్‌షా కాన్సెప్ట్ ఉండటం ఆసక్తికరంగా ఉందని వ్యంగ్యంగా స్పందించారు.

ఆప్ కేంద్ర కార్యాలయానికి స్థలం కేటాయింపు

న్యూదిల్లీ: సుదీర్ఘ పోరాటం తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కార్యాలయానికి కేంద్ర ప్రభుత్వం స్థలం కేటాయించింది. లుటియన్స్ దిల్లీ ప్రాంతంలోని పండిట్ రవిశంకర్ శుక్లా మార్గంలో ఒకటో నంబర్ బంగ్లాను ఆప్ కార్యాలయంగా వినియోగించుకునేందుకు అనుమతిచ్చింది. 'దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆప్‌కి రవిశంకర్ శుక్లా మార్గంలోని బంగ్లాను కేటాయించారు' అని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆప్ కేంద్ర కార్యాలయం రౌస్ అవెన్యూ ప్రాంతంలో ఉంది. అయితే, ఇదే స్థలాన్ని దిల్లీ హైకోర్టు విస్తరణకు కేటాయించడంతో వివాదం తలెత్తింది. ఈ అంశంపై మార్చి4న విచారణ జరిపిన సుప్రీంకోర్టు జూన్ 15 కల్లా బంగ్లాలోని ఆప్ కార్యాలయాన్ని ఖాళీ చేయాలంటూ గడువు విధించింది. అయితే, ఆప్ తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి అభ్యర్థన మేరకు ఆ గడువును మరో రెండు నెలల పాటు పొడిగిస్తూ ఆగస్టు 10 నాటికి ఖాళీ చేయాలని తెలియజేసింది. మరోసారి గడువు పెంపు ఉండబోదని స్పష్టం చేసింది. జాతీయ పార్టీగా గుర్తింపుపొందిన నేపథ్యంలో పార్టీ అవసరాలు దృష్టిలోఉంచుకొని దిల్లీలో తమ కార్యాలయాన్ని ఏర్పాటుచేసుకోవడానికి స్థలం కేటాయించాలని ఆప్ గతంలో కేంద్రాన్ని కోరింది. ప్రస్తుత కార్యాలయాన్ని ఖాళీ చేయడానికి సుప్రీంకోర్టు చివరి అవకాశంగా ఆగస్టు 10 వరకు పార్టీకి సమయం ఇచ్చిందని, దీనిపై వెంటనే నిర్ణయం తీసుకోవాలంటూ ఆప్ తరపు న్యాయవాది దిల్లీ హైకోర్టును కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన న్యాయస్థానం కేటాయింపుపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. గురువారం(జులై 25) వరకు గడువు ఇచ్చింది. దిల్లీ హైకోర్టు ఇచ్చిన గడువు ముగిసిపోతున్నందున లుటియన్స్ దిల్లీ ప్రాంతంలో బంగ్లా కేటాయించినట్లు ఆప్ వర్గాలు తెలిపాయి.

కంగనకు హైకోర్టు నోటీసులు

సిమ్లా: ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ఎన్నికను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలైంది. దీంతో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు కంగనాకు నోటీసు జారీ చేసింది. కిన్నౌర్ నివాసి లాయక్ రామ్ నేగి అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్‌పై కంగనా నాలుగు లక్షల మెజార్టీతో గెలిచారు. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో కంగనా రనౌత్ పోటీ చేసిన మండీ స్థానం నుంచి నేగి పోటీ చేయాలనుకున్నాడు. మండీ డిప్యూటీ కమిషనర్ తన నామినేషన్ పత్రాలను తిరస్కరించారని... అందుకే తాను ఎన్నికల్లో పోటీ చేయాలేకపోయానని నేగి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. నామినేషన్ సందర్భంగా విద్యుత్, నీరు, టెలిఫోన్ శాఖల నుంచి 'నో డ్యూ' సర్టిఫికెట్ సమర్పించేందుకు ఒకరోజు గడువు ఇచ్చారు. వాటిని తాను సమర్పించినా రిటర్నింగ్ అధికారి (మండీ డిప్యూటీ కమిషనర్) తన నామినేషన్ పత్రాలను ఆమోదించకపోవడంతో ఎన్నికల్లో పోటీ చేయలేకపోయానని పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఒకవేళ ఎన్నికల్లో తాను అభ్యర్థిగా నిలబడినట్లయితే కచ్చితంగా గెలిచేవాడినని, ఉద్దేశపూర్వకంగానే తనను ఎన్నికల నుంచి అధికార యంత్రాంగం తప్పించిందని ఆయన పిటిషన్‌లో స్పష్టం చేశారు. అందుకే కంగనా ఎన్నికపై నేగి అభ్యంతరం వ్యక్తం చేశాడు.

బీజేపీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

మత విభజనకు ఆగని కుట్ర

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావటానికి మోదీ ప్రభుత్వం బ్లాక్‌మెయిల్, బెదిరింపు రాజకీయాలకు పాల్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చుండూరు వెంకట సుబ్బారావు అధ్యక్షతన గురువారం స్థానిక దాసరి భవన్‌లో ఈ సమావేశం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయటం లేదని ప్రకటించిన వెంటనే జైలులో ఉన్న చంద్రబాబుకు బెయిల్ వచ్చిందన్నారు. చంద్రబాబు, నితీశ్‌కుమార్ ఎన్‌డీఏలో చేరకపోతే బీజేపీ అధికారంలోకి వచ్చేది కాదన్నారు. ఎన్‌డీఏ బలం తగ్గిందని ఎవరూ భావించవద్దని సూచించారు. మత విభజన ద్వారా అధికారంలోకి రావడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను సుప్రీంకోర్టు నిలిపేసి...బీజేపీ కుట్రలను తిప్పికొట్టిందని చెప్పారు. వలసవాదులు, ముస్లింలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ఈ కొత్త ధోరణి నడుస్తుందన్నారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఒక్క సమస్య పరిష్కరించలేదన్నారు. ముంబై విమానాశ్రయంలో చిన్నచిన్న ఉద్యోగాలకు పీజీ చదివిన వారు లక్షల్లో దరఖాస్తు చేయటం నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే పరిస్థితి ఉండకూడదనే కేజ్రీవాల్‌కు కోర్టు బెయిల్ ఇచ్చినా... సీబీఐ మళ్లీ అరెస్టు చేసిందని విమర్శించారు. ప్రపంచంలో సంపన్నులు, దరిద్రులు ఉన్న దేశం మనదేనన్నారు. కార్పొరేట్లు రాజకీయాలు శాసిస్తున్నారని చెప్పారు.

మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలన చూసిన తరువాత రాష్ట్ర ప్రజలు ఆయనను అధికారానికి దూరం చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సీఎంగా జగన్ ఉండాలా? వద్దా? అనే ఏకైక అజెండాతో జరిగాయని ఉద్ఘాటించారు. దేశ రాజకీయాలు, సమస్యలపై సాధారణ ప్రజలు, విద్యావంతులు ఆలోచన చేయటం లేదన్నారు. కమ్యూనిస్టు పార్టీ కంచుకోటగా ఉండే విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి విజయమే అందుకు నిదర్శనమన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని తగులబెట్టడం దారుణమన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇచ్చే మొత్తాన్ని రుణంగా కాకుండా గ్రాంట్‌గా మార్చాలని, పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ బీజేపీ విధానాలపై కమ్యూనిస్టు పార్టీ రాజకీయ తీర్మానం సరైనదేనన్నారు. పార్టీ శాఖలు, ప్రజాసంఘాలు పని విధానంలో చైతన్యం లోపించిన కారణంగా ఓట్లు రాబట్టడంలో విఫలమయ్యాయని పేర్కొన్నారు. నాయకులు కిందిస్థాయి వరకు వెళ్లి పని చేయాలని సూచించారు. నవంబరు 7వ తేదీ నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాల్సి ఉందన్నారు. డిసెంబరు 26న దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ శతవార్షిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల్లో పోటీ చేసిన జి.కోటేశ్వరరావుకు పార్టీ ఏకోన్ముఖంగా పని చేసిందన్నారు. బీజేపీ అభ్యర్థి మెజార్టీ గమనించిన తరువాత ముస్లింలు కూడా బీజేపీకి ఓటు వేసినట్లు తెలుస్తుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ లౌకిక నినాదంపై పునరాలోచించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. జిల్లాలో ఇటీవల వివిధ పరిశ్రమల్లో జరిగిన వరుస ప్రమాదాలపై సీపీఐ ముందుండి బాధితులకు అండగా నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో పార్టీ, ప్రజాసంఘాలను బలోపేతం చేయటానికి కార్యాచరణ రూపొందించామని, ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నట్లు వివరించారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య కమ్యూనిస్టు పార్టీ గొప్పదనాన్ని వివరిస్తూ అభ్యుదయ గీతాలు ఆలపించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి పి.దుర్గాభవాని, సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి టి.తాతయ్య, ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేశ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య, వల్లంకొండ బ్రహ్మం, పరుచూరి రాజేంద్రబాబు, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హాస్టల్ భవన నిర్మాణం పూర్తి చేయాలి

కేవీవీ ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-గన్నవరం: అసంపూర్తిగా ఉన్న హాస్టల్ భవన నిర్మాణం పూర్తి చేయడానికి తగు నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, జిల్లా కన్వీనర్ సాదిక్‌తో కలిసి గన్నవరంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ... ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తుందని... మీ సమస్యలు నిర్భయంగా చెప్పాలని విద్యార్థులకు సూచించారు. గతంలో నిర్మించిన హాస్టల్ భవనం అసంపూర్తిగా ఉండిపోవటం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే ప్రభుత్వం పూర్తిస్థాయిలో భవనం నిర్మించడానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది అక్టోబర్ నుండి విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న మెస్ బిల్లు చెల్లించాలని, విద్యార్థులకు దోమతెరలు ఇవ్వాలని, చలికాలంలో విద్యార్థులకు రగ్గులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ముద్రించిన జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ముక్కమాల ఉమామహేశ్వరవు, పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, వార్డెన్ ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అందుబాటులో నాణ్యమైన కోర్సులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి నాణ్యమైన కోర్సులను ఉన్నత విద్యామండలి అందుబాటులో ఉంచింది. పాఠశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ అధ్వర్యంలో వివిధ కోర్సులను ప్రవేశపెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ అధ్వర్యంలో 169 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు పనిచేస్తుండగా, వాటిలో 24 కళాశాలలు స్వయం ప్రతిపత్తి హోదా కలిగి ఉన్నాయి. 23 మహిళా డిగ్రీ కళాశాలలు వసతి గృహ సదుపాయంతో అందుబాటులో ఉన్నాయి. 106 కళాశాలలు న్యాక్ అక్రిడిటేషన్‌ను పొందగా, మరిన్ని అక్రిడిటేషన్‌కు సిద్ధమవుతున్నాయి. డిజిటల్ వర్చువల్ తరగతి గదులు, అధునాతన ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, విశాలమైన క్రీడా మైదానాలు, బొటానికల్ గార్డెన్స్, మెడిసినల్ గార్డెన్స్, అత్యాధునిక జిమ్ సౌకర్యాలు, నైపుణ్య శిక్షణా కేంద్రాలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు అధునాతన విద్యా విధానాలుగా విలసిల్లుతున్నాయి. విద్యార్థులలో సామాజిక స్పృహ, పర్యావరణ పరిరక్షణ బాధ్యతను పెంపొందించేందుకుగాను విద్యలో అంతర్భాగమైన కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రభుత్వేతర సంస్థలు, దాతల సౌజన్యంతో వివిధ రకాలైన ఉపకారవేతన సదుపాయాలు విద్యార్థులకు కల్పిస్తున్నారు. 2024 పీజీ ప్రవేశ పరీక్షలో 1,673 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. జేకేసీ నైపుణ్య శిక్షణా సంస్థల ద్వారా ప్రభుత్వ ఉద్యోగార్థులకు పోటీపరీక్షల నిమిత్తం నిరంతర శిక్షణనిస్తున్నారు. జాతీయ గణతంత్ర వేడుకలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన ఎనిమిది మంది, రాష్ట్ర ప్రభుత్వ వేడుకలో 13 మంది, జిల్లా స్థాయి వేడుకలలో 78 మంది క్యాడెట్లు భాగస్వాములయ్యారు.

ఒలింపిక్స్‌లో సత్తాచాటిన తెలుగు తేజం

ఆర్చరీ ర్యాంకింగ్‌లో 4వ స్థానంలో నిలిచిన బొమ్మదేవర ధీరజ్

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్ లో ఆర్చరీలో భారతదేశం తరపున ప్రాతినిథ్యం వహిస్తున్న బొమ్మ దేవర ధీరజ్ తన ర్యాంకింగ్‌ను మరింత మెరుగుపరుచుకున్నాడు. ర్యాంకింగ్ రౌండ్‌లో 4వ ర్యాంకు ఎగబాకిన ధీరజ్... ఆర్చరీలో భారత్‌కు పతకంపై ఆశలు చిగురింపజేశాడు. విజయవాడలోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ ట్రెయినీ స్వర్గీయ చెరుకూరి లెనిన్ శిష్యుడు బొమ్మదేవర ధీరజ్... గురువారం పారిస్‌లోని ఇన్వాలీడ్స్ ప్రధాన అర్చరీ ప్రాంగణంలో ప్రారంభమైన ఒలింపిక్స్ ఆర్చరీ పురుషుల ర్యాంకింగ్ రౌండ్ లో పాల్గొని 720 పాయింట్లకు గాను 681 పాయింట్లు సాధించి 4వ ర్యాంక్ సాధించడమే గాక తిరిగి తన ప్రతిభతో భారత పురుషుల జట్టు సభ్యులైన తరుణ్ దీఫ్ రాయ్, ప్రవీణ్ జారవ్‌తో కలిసి 2013 పాయింట్లు సాధించడం ద్వారా తన జట్టును 3వ ర్యాంక్‌లో నిలిపాడు. మిక్స్‌డ్ విభాగంలో సైతం అంకిత్ భగత్ తో కలిసి 1347 పాయింట్లు సాధించి... భారత జట్టును 5వ ర్యాంక్ లో నిలబెట్టాడు. దీని ద్వారా భారత జట్టుకు ఒలింపిక్స్ పతకంపై ఆశలు రేపాడు. 28వ తేదీన మహిళల టీమ్ విభాగంలో అంకిత భగత్, భజన్ కౌర్, దీపిక కుమారిలతో కూడిన భారత జట్టు 4వ ర్యాంకర్‌గా టీమ్ విభాగంలో పోటీ పడుతుంది. 29న బొమ్మదేవర ధీరజ్, తరుణీప్ రాయ్, ప్రవీణ్‌తో భారతజట్టు (3వ ర్యాంకు) నేరుగా క్వార్టర్ ఫైనల్లో తలపడుతుంది. ఆగష్టు 2వ తేదీన బొమ్మదేవర ధీరజ్, అంకిత భగత్ జట్టు (5వ ర్యాంక్) పోటీ పడుతుంది.

వైద్య శిబిరం సందర్భంగా మద్దుకూరి చంద్రానికి నివాళులర్పిస్తున్న హరినాథరెడ్డి, మనోహర్ నాయుడు, రాంబాబు, మురళీకృష్ణ తదితరులు

విశాలాంధ్ర సిబ్బందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-విజయవాడ: విశాలాంధ్ర వ్యవస్థాపక సంపాదకులు, ఆంధ్ర కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరు, స్వాతంత్ర్య సమరయోధులు మద్దుకూరి చంద్రశేఖరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకుని విశాలాంధ్ర సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, ఎండోకేర్ హాస్పటల్, ఆపిల్ డెంటల్ హాస్పటల్ వారి సౌజన్యంతో గురువారం చంద్రం బిల్డింగ్‌లో ఈ వైద్య శిబిరం జరిగింది. సంపాదకవర్గం, ప్రింటింగ్ విభాగాలు, కార్యాలయ సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. మాక్సీవిజన్ టీమ్ మునేశ్వరరావు, ఆహ్మద్ పాషా, రాజేశ్వరి, శంకర్, ఎండోకేర్ నుంచి సుధాకర్, ఆపిల్ డెంటల్ ఆసుపత్రి నుంచి డాక్టర్ బత్తుల విష్ణుప్రియ, పి.రేఖ, ఎం.చంటి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు, న్యూస్ ఎడిటర్ ఎం.మురళీకృష్ణ, సీఏ రాంబాబు, విజయవాడ ఎడిషన్ మేనేజర్ సాయిబాబు పాల్గొన్నారు.

విశాఖ ఓడరేవుకు మాంగనీస్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: న్యూ కాసిల్ మాక్స్ లైన్, ఎంవీ హహైన్ నౌకలు గురువారం విశాఖపట్నం పోర్టుకు చేరుకున్నాయి. వీటిని జనరల్ కార్గో బెర్త్ లో

నిలుపుదల చేశారు. ఎంవీ హహైన్ ... గాబన్ నుంచి 1,99,900 మెట్రిక్ టన్నుల మాంగనీస్‌ను పోర్టుకు తీసుకొచ్చింది. ఇందులో 1,24,500 మెట్రిక్ టన్నులను విశాఖపట్నం పోర్టులో అన్ లోడింగ్ చేశారు. ఈ నౌక 300 మీటర్ల పొడవు, 50 మీటర్ల వెడల్పు 18.46 మీటర్ల డ్రాఫ్ట్ కలిగి ఉంది. ప్రపంచంలోనే పేరు పొందిన ప్రముఖ మాంగనీస్ ఎగుమతిదారుడు ఎరామెట్ ఎస్.ఎ. ఫ్రాన్స్ భారీ నౌక ద్వారా రవాణా చేశారు. బోత్రా షిప్పింగ్ సర్వీసెస్ సరుకు నిర్వహణ ఏజెంట్లుగా సేవలు అందిస్తోంది. ఈ షిప్మెంట్ ... బోత్రా షిప్పింగ్ సర్వీసెస్‌కు ఒక ముఖ్యమైన మైలురాయిగా విశాఖపట్నం పోర్టు చైర్మన్ ఎం .అంగముత్తు అభివర్ణించారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ (వీపీఏ) బల్క్ కార్గో ట్రాన్షిప్‌మెంట్‌కు కేంద్రంగా మార్చడానికి కృత నిశ్చయంతో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. వివరాలను పోర్టు కార్యదర్శి టీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు.

దళిత సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తాం

మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలను త్వరలో పునరుద్ధరిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. శాసనసభలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ వైసీపీ పాలనలో దళితులకు అడుగడుగునా అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీగానీ... నూతన పారిశ్రామిక విధానం అమలుగానీ చేయలేదని విమర్శించారు. బీ,సీ విభాగాల కింద మెడికల్ సీట్లలో 'రూల్ ఆఫ్ రిజర్వేషన్'... అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం అమలుకు నోచుకోలేదన్నారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులకు 41 సీఆర్పీసీ కింద స్టేషన్ బెయిల్ మంజూరు చేశారన్నారు. ఎస్సీలకు ఇళ్ల నిర్మాణం కోసం గతంలో టీడీపీ ప్రభుత్వమిచ్చిన రూ.50వేల అదనపు ఆర్థిక సహాయాన్ని జగన్ నిలిపేశారన్నారు. ఉద్యోగాల పదోన్నతులకు 'రూల్ ఆఫ్ రిజర్వేషన్' అమలు సక్రమంగా జరగలేదని, పథకాల అమలులో ఎస్సీలకు ప్రాధాన్యత ఇవ్వలేదని తెలిపారు. 2014-19లో ఐఎస్‌బీ రంగ, పశు సంవర్ధక శాఖ కింద బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా 60 శాతం సబ్సిడీతో రూ.2716.70 కోట్లతో 2,02,414 మంది ఎస్సీలకు ప్రయోజనం చేకూర్చామని తెలిపారు. పేదలకు భూమి కొనుగోలు పథకం ద్వారా రూ.197కోట్లతో 2,518 మందికి 2360.77 ఎకరాల పంపిణీ చేశామన్నారు. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం ద్వారా రూ.29.39కోట్లతో 669 మందికి ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రోపాలిటన్ నగరాల్లో ఉచితంగా సివిల్ సర్వీసెస్ కోచింగ్ అందించామని గుర్తుచేశారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.32.23 కోట్లతో 437 మందికి విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించే అవకాశం కల్పించామన్నారు. ఆ పథకానికి ఉన్న అంబేద్కర్ పేరును జగన్ హయాంలో మార్చి... అవమానించారని విమర్శించారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. దళిత సంక్షేమ పథకాలన్నీ త్వరలోనే పునరుద్ధరిస్తామని మంత్రి డోలా హామీనిచ్చారు.

కేజ్రీవాల్ ఆరోగ్యంపై 30న 'ఇండియా' నిరసన

న్యూఢిల్లీ: మద్యం విధానం కేసులో అరెస్టయి తీహార్ జైలులో ఉన్న ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యంపై 'ఇండియా' ఐక్య సంఘటన ఆందోళన వ్యక్తం చేసింది. కేజ్రీవాల్ ఆరోగ్యంపై అధికార వర్గాల వైఖరిపై ఢిల్లీలో నిరసనలకు సమాయత్తమవుతుంది. ఈ విషయాన్ని ఆప్ గురువారం వెల్లడించింది. జులై 30న విపక్ష కూటమి పార్టీల అధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలుపుతామని ఆప్ ప్రకటించింది. కేజ్రీవాల్ హత్యకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించింది. కాగా మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ తీహార్ జైలుకు వెళ్లిన తర్వాత 8.5 కిలోల బరువు తగ్గారని, ఆయన చక్కెర స్థాయిలు ఐదుసార్లు 50 కంటే తక్కువకు పడిపోయాయని ఆప్ నేతలు చెబుతున్నారు. ఇవి కేవలం ఆరోపణలు మాత్రమేనని జైలు అధికారులు ఖండించిన సంగతి తెలిసిందే.

చేనేత ఎగ్జిబిషన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

జౌళి శాఖ మంత్రి సవిత

విశాలాంధ్ర-విజయవాడ: వచ్చే నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న చేనేత ఎగ్జిబిషన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, సౌకర్యాల కల్పనలో అలక్ష్యం చేయొద్దని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. నగరంలోని మేరీస్ స్టెలా కాలేజీ, ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. ముందుగా మేరీస్ స్టెల్లా కాలేజీని ఆమె పరిశీలించారు. వర్షాల దృష్ట్యా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించారు. సీఎం చంద్రబాబు చేనేత ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించే అవకాశముందని అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. అతిథుల వాహనాల పార్కింగ్, చేనేత కార్మికులు, సందర్శకులకు సౌకర్యాల కల్పనపై ప్రధానంగా దృష్టి పెట్టాలన్నారు. వచ్చే నెల ఏడో తేదీ నుంచి పది రోజుల పాటు జరిగే చేనేత ఎగ్జిబిషన్లను ప్రజలు సందర్శించేలా విస్తృతమైన ప్రచారం కల్పించాలన్నారు. చేనేత కార్మికుల్లో అవగాహన కల్పించి, ఈ చేనేత ఎగ్జిబిషన్ లో అత్యధిక స్టాళ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. 80 స్టాళ్లు ఏర్పాటు చేసే అవకాశముందని, ఇందుకోసం 300ల మంది చేనేత కార్మికులు రానున్నారని మంత్రికి అధికారులు వివరించారు. స్టాళ్లు ఏర్పాటు చేసేవారికి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎగ్జిబిషన్ లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డిసెంబరుకు టిడ్కో ఇళ్లు పూర్తి: నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. టిడ్కో గృహాలపై టీడీపీ ఎమ్మెల్యేలు పీజీవీఆర్ నాయుడు,వెలగపూడి రామకృష్ణ బాబు, తెనాలి శ్రావణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాసరావు గురువారం అసెంబ్లీలో అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2014-19లో టిడ్కో ద్వారా మొత్తం 7,014,81 ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. వీటిలో ఐదు లక్షల ఇళ్లకు నాటి టీడీపీ ప్రభుత్వంలో పాలనాపరమైన అనుమతులు జారీ చేసిందన్నారు. ఐదు లక్షలకుగాను 3,13,832 ఇళ్లకు టెండర్లు పిలవగా 77,371 ఇళ్లు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. అలాగే 89,671 ఇళ్లు 75 శాతం పూర్తి కాగా 49,329 ఇళ్లు 50 శాతం పూర్తి అయినట్లు చెప్పారు. 2,16,370 ఇళ్లు 2019 ఏడాదిలోపే చాలా వరకూ పూర్తి చేసినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం 25 శాతం నిర్మాణాలు కూడా పూర్తి చేయని కారణంతో 52,192 ఇళ్లను జాబితా నుంచి తొలగించిందని మంత్రి నారాయణ వెల్లడించారు.

ఢిల్లీలో కాదు... అసెంబ్లీలో చెప్పండి

రాజకీయ హత్యలపై జగన్‌కు వంగలపూడి అనిత సవాల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో 36 మంది రాజకీయ హత్యలపై వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఆరోపణలు చేయడాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత ఆక్షేపించారు. ఢిల్లీ వెళ్లి ధర్నా చేయడం ఎందుకు... ఆ హత్యల వివరాలు రాష్ట్ర అసెంబ్లీలోనే చెప్పవచ్చుగా అంటూ ఆమె సవాల్ విసిరారు. 36 రాజకీయ హత్యలు జగన్ ఆరోపించారని, హత్యకు గురైన వారి పేర్లు ఎందుకు చెప్పరని ప్రశ్నించారు. హత్యకు గురైన వారంతా వైసీపీ వాళ్లు అయితే సంబంధిత వివరాలన్నీ సభకు వచ్చి వెల్లడించాలని సూచించారు. వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. అవి సరైన వివరాలని కాదని తేలితే మాత్రం ఆ తదుపరి ప్రభుత్వం తీసుకునే చర్యలకు జగనే భాద్యులవుతారని అనిత హెచ్చరించారు. అధికారాన్ని కోల్పోయి టీడీపీ కార్యకర్తలను చంపి... ఢిల్లీ వెళ్లి దీక్ష చేసి ఏం సాధించాలని అనుకుంటున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చనిపోయిన నలుగురిలో ముగ్గురు టీడీపీ వారన్నారు. ఇందుకు సంబంధించిన కేసు నంబర్లను అనిత వెల్లడించారు. నాడు ప్రతిపక్ష నేతగా ఆత్మకూరుకు చంద్రబాబు వెళ్లాలనుకుంటే ఆయన ఇంటి గేటుకు తాళ్లు కట్టారని, అమరావతి రైతుల వద్దకు పవన్ కళ్యాణ్ వెళితే ముళ్లకంపలు వేశారని, యువగళం యాత్రలో లోకేశ్‌కు బల్లపై నిల్చోడానికీ అనుమతి ఇవ్వలేదని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం మీడియా సహా ఎవరినీ వదల్లేదని అనిత విమర్శించారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.